మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## పార్టీ క్రమశిక్షణ చర్యల కింద...
## బిజెపి నుంచి ఇద్దరి సస్పెన్షన్: బిజెపి పట్టణ అధ్యక్షుడు శంకర్‌గౌడ్

**రామాయంపేట, జనవరి 3, ప్రభాతవార్త :**

తమ వ్యక్తిగత చెడు ప్రవర్తన వలన బిజెపి పార్టీకి చెడు పేరు ఆపాదిస్తున్నందున, పార్టీ క్రమశిక్షణ చర్యల క్రింద పట్టణానికి చెందిన కమ్మరి రాంచంద్రం, శీలం అవినాష్‌రెడ్డి అనే కార్యకర్తలను పార్టీనుండి తొలగిస్తున్నట్లు బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుడు జంగంపల్లి శంకర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం నాడు పార్టీ సభ్యులతో సమావేశం ఏర్పరచుకొని పార్టీలో ఉన్న కార్యకర్తలు సమాజంలో చెడు ప్రవర్తనగా ప్రవర్తిస్తున్న విషయం గురించి చర్చించి అందరి ఆమోదం మేరకు వీరిరువురుని పార్టీని నుండి తొలగిస్తున్నట్లు తీర్మాణం చేశామన్నారు. ఇక ముందు కూడా పార్టీకి చెడ్డపేరు తెచ్చే ఎవరినైనా ఉపేక్షించేది లేదన్నారు. పార్టీ ఎదుగుదల, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

## 'స్వచ్ఛ సర్వేక్షన్'లో సిద్దిపేట జిల్లాకు మొదటి స్థానం
### రెండోస్థానంలో జగిత్యాల.. మూడోస్థాంనలో కొట్టాయం

**సిద్దిపేట రూరల్, జనవరి 3, ప్రభాతవార్త :** 2023 సంవత్సరానికి గానూ నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్(గ్రామీణ) కార్యక్రమాలకుగానూ సిద్దిపేట జిల్లా ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా కేటగిరిలో మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో జగిత్యాల, మూడో స్థానంలో కొట్టాయం(కేరళ)నిలిచింది. స్వచ్ఛ భారత్ మిషన్(గ్రామీణ) కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్(గ్రామీణ) తాగునీరు, పారిశుద్ధ్య మం త్రిత్వశాఖ భారత ప్రభుత్వ అధ్వర్యంలో 2018 నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వివిధ ప్రభుత్వ పథకాల వలన గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సౌకర్యాల ఏర్పాట్లు, ప్రజల భాగస్వామ్యం, పారిశుద్ధ్యం పట్ల ప్రజలకు అవగాహన అంచనా వేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఈ సందర్భంగా జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులకు, ప్రజాప్రతినిధులకు మంత్రి హరీష్‌రావు అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి
### -ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్ అర్బన్, జనవరి 3 ప్రభాతవార్త:** యువజనులను ప్రోత్స హించి వారి శక్తియుక్తుల్ని దేశాభివృద్ధికి ఉపయోగపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన 2023 జిల్లా స్థాయి యువజనోత్స వాలను జ్యోతిని వెలిగించి, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థినుల నృత్యాలు, ఆట, పాటలు ఆహుతులను మంత్రముగ్ధులను చేసాయి. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విద్యార్థినులతో కలిసి నృత్యం చేసి వారిలో జోష్ నింపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ యువజనోత్స వాలలో విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం ముదాహమన్నారు. యువతలోని ప్రతిభను వెలికి తీయడానికి యువజనోత్స వాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. యువత మంచి ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయిలో మెదక్ జిల్లాకు పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ లావణ్య రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షులు గంగాధర్, మున్సిపల్ కౌన్సి లర్ లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఉమర్ మొహిద్దీన్, నాయకులు దుర్గాప్రసాద్, మహమ్మద్ జుబేర్ అహ్మద్, కొండ శ్రీనివాస్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట సమీకృత మార్కెట్ దేశానికే ఆదర్శం
### ఎఫ్ఎస్ఎస్ఎఐ బృందం కితాబు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



సమీకృత మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఎఫ్ఎస్ఎస్ఎఐ బృందం

భవిష్యత్ సిద్దిపేటను దృష్టిలో పెట్టుకొని..ప్రజల ఆరోగ్య రక్షణకై సిద్దిపేట వెజ్ నాన్‌వెజ్ సమీకృత మార్కెట్ ఆదర్శమని ఎఫ్ఎస్ఎస్ఎఐ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత మార్కెట్ యార్డును బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ విజితవేణుగోపాల్‌రెడ్డి, పాలక మండలి సభ్యులతో కలిసి బృందం సమీకృత మార్కెట్‌ను క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సిద్దిపేట మార్కెట్ యార్డు ఎంతో అద్భుతంగా ఉందని మోడల్‌గా నిర్మించారని ఇక్కడి సౌకర్యాలు, పరిసరాలు, వ్యక్తి గత పరిశుభ్రంత చాలా బాగుందన్నారు. ఎఫ్ఎస్ఎస్ఎఐ నిబంధనలు ప్రజల రక్షణ పరిశుభ్రత అని అందుకు అనుగుణంగా సిద్దిపేట మార్కెట్ అనుసరిస్తుందన్నారు. మంత్రి హరీష్‌రావు ప్రజల ఆరోగ్య రక్షణ కోసం దుమ్ము, ధూళిలో కాకుండా స్వచ్ఛమైన కూరగాయలు అందించాలని సమీకృత మార్కెట్ నిర్మించారన్నారు. భవిష్యత్ ప్రజల ఆరోగ్యరక్షణకు తీసుకున్న ఈ గొప్ప నిర్ణయం భేష్‌గా ఉందన్నారు. సమీకృత మారె ్కట్‌లో పరిశుభ్రతపై తీసుకుంటున్న చర్యలు చాలా బాగున్నాయన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఎస్ఎఐ బృందం ప్రతినిధులు వికాస్ మిశ్రా, విజయ్‌కుమార్, జ్యోతిర్మయి, ఎంఎ కలీల్, ధర్మేంద్ర, కృష్ణమూర్తి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు దరిపల్లి శ్రీను, చైతన్య, మార్కెట్ కమిటీ సిబ్బంది ఉన్నారు.

## నిరాధార ఆరోపణలు సమంజసం కాదు..
### -హుస్నాబాద్ విద్యుత్‌శాఖ ఏడిఇ ఆరె దుర్గశ్రీనివాస్

**హుస్నాబాద్, జనవరి 3, ప్రభతవార్త :** గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయ పనుల విషయంలో విద్యుత్ అధికారులమైన తాము అమాయక గిరిజన పేద రైతాంగం వద్ద పైసలు తీసుకుని పనులు చేస్తున్నామని మంగళవారం 'ప్రభాతవార్త'లో ప్రచురితమైన పైసలు ముట్టనిదే పని చేయడట అనే శీర్షికన వార్తఅంశం ప్రచురితమైన విషయంలో ఎలాంటి వాస్తవం లేదని నిరాధారారఆరోపణలుగా హుస్నాబాద్ విద్యుత్‌శాఖ ఏడిఇ ఆరె దుర్గాప్రసాద్ కొట్టిపారేశారు.తాము సహజంగాన ఒక శాఖకు చెందిన అధికారులం ఇక్కడ ప్రాతినిథ్యం వహిస్తున్న శాసనసభ్యులు వొడితెల సతీష్‌కుమార్‌కు విధేయులుగా పేద గిరిజనుల పనులు తమ దృష్టికి తీసుకురాగానే పనులు చేస్తున్నామని ఈ విషయంపై తమకు ఎమ్మెల్యే అండనిస్తున్నాడంటూ అక్కన్నపేట మండలం కపూర్‌నాయక్ తండ గ్రామ సర్పంచ్ బానోతు సంతోష్‌నాయక్ ఆరోపించడంలో ఎలాంటి వాస్తవం లేదని ఇలాంటి నిరాధారారపణలు మాత్రమేనని ఖండించారు.ఈ విషయంలో తమ దృష్టికి వచ్చిన పక్షంలో రైతాంగం పనులపై ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా పరిష్కరిస్తున్నామని డబ్బులను వసూలు చేయడం లేదని స్పష్టం చేశారు.తమ విద్యుత్‌శాఖ కింది స్థాయి అధికారులు సిబ్బంది ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడతున్నారా అనే విషయంపై తాము కూలంకషంగా పరిశీలన చేస్తున్నామని దర్గా శ్రీనివాస్ తేల్చిచెప్పారు. అభివృద్ధి విషయంలో తాము భాగస్వాములనే విషయాన్ని గుర్తుంచుకుని ఒళ్ళు దగ్గర పెట్టుకుని పనులు చేస్తున్నామని చెప్పారు.రైతాంగం ఇక్కట్లకు గురవుతున్న విషయంలో సైతం ఎక్కడ విద్యుత్‌శాఖకు సంబంధించిన పనులు పరిష్కారం కాలేదో కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు.ఈ విషయంపై తాను ఎలాంటి విచారణకైనా సిద్ధమేనని చెబుతూ ఇలాంటి ఎలాంటి ఆధారాలు లేకుండా బురద చల్లే ప్రయత్నం చేయవద్దని ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.అలాగే ఇలాంటి ఆరోపణల విషయంలో తాము సైతం విద్యుత్‌శాఖకు రైతులను పిలిపించి డబ్బుల విషయంలో వాస్తవం ఏమిటని తెలుసుకుని అందరికి స్పష్టం చేస్తామని ఆరె దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు.

## గుండెపోటులో కో-ఆప్షన్ సభ్యుడి మృతి

**జహీరాబాద్ (మొగుడంపల్లి), జనవరి 3, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండల కో-ఆప్షన్ సభ్యులు తాజుద్దీన్ సోమవారం రాత్రికి గుండెపోటుతో తిరిగిరాని లోకాలకు చేరిపోయారు. మండలంలోని అసద్‌గంజ్ గ్రామానికి చెందిన తాజుద్దీన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా సేవలు అందిస్తున్నారు. గతంలో ఉమ్మడి జహీరాబాద్ మండల కో-ఆప్షన్ సభ్యులుగా సైతం సవేలు అందించారు. తాజుద్దీన్ మృతి చెందినట్లు తెలుసుకున్న టిపిసిసి సభ్యులు వై నరోత్తం మంగళవారం అసద్‌గంజ్ గ్రామానికి చేరుకుని తాజుద్దీన్ పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. అశ్రునయనాలతో మంగళవారం అసద్‌గంజ్ గ్రామంలో అంతక్రియలు నిర్వహించారు.

## నత్తనడకన పనులు 'మన ఊరు మన బడి'పనులు

**నిధులకు ధోకా లేదు**
**సిఎం ఇలాఖాలో టెండర్లకే దిక్కులేదు**
**341 పాఠశాలల పనులకుగానూ 48 పూర్తి**
**17పాఠశాలల్లో చివరిదశకు చేరుకున్న పనులు**
**ఖారారు కానీ 55 పాఠశాలల టెండర్లు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించి ఆదర్శంగా తయారు చేయడంతోపాటు విద్యార్థులకు అభ్యాసన వాతావరణం కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని గత ఏడాది మన ఊరు మన బడి పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే!. ఈక్రమంలో జిల్లాలో ఈ పథకం కింద మండలంలో మూడోవంతు చొప్పున 343 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో రెండు పాఠశాలలను రద్దుచేశారు. ఇందుకుగానూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 88 కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.40 కోట్లు చొప్పున మొత్తం రూ.128 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.30 లక్షల పైన 97 పాఠశాలలకు నిధులు కేటాయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా జిల్లాలో మాత్రం మన ఊరు మన బడి పనుల ఆలస్యంగా జరుగుతున్నాయి. 341 పాఠశాలలకుగానూ గత వారంలో 48 పాఠశాలల్లో పనులు పూర్తికాగా మరో 17 పాఠశాలల్లో పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఆ పనులకుగానూ రూ.14 కోట్ల నిధులు చెల్లించారు. ఈనెల 2న జిల్లాలో వంద పాఠశాలలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గత జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మంత్రి హరీష్‌రావు ఆదేశాలు జారీచేసినా నేటికి కేవలం 48 పాఠశాలల్లోనే పనులు పూర్తిచేశారు. అధికారుల పర్యవేక్షణ లోపం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మూలంగా జిల్లాలో మన ఊరు మన బడి పథకం పనులు నత్తనడకన నడుస్తున్నాయి. కాగా హుస్నాబాద్ నియోజవర్గంలో 49 పనులకుగానూ 6 పనులకు టెండర్లు పూర్తి కాలేదు. జనగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 38 పనులకుగానూ 4 పనులు, సిద్దిపేటలో 76 పనులకుగానూ 6, దుబ్బాకలో 75 పనులకు గానూ 4 పాఠశాలల్లో పనులకు నేటికి టెండర్లు పూర్తి కాలేదు. కాగా రూ.30 లక్షలలోపు ఉన్న పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, ఎస్ఎంఎస్ చైర్మన్లు చేస్తుండగా రూ. 30 లక్షల పై ఉన్న పనులకు టెండర్లు పిలవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలుస్తుంది.

**సిఎం ఇలాఖాలో టెండర్లకు దిక్కు లేదు**

మన ఊరు మన బడి పథకం కింద చేపట్టే పనులకు నిధుల ధోకా లేదు..సిఎం కెసిఆర్ సొంత జిల్లా తన ఇలాఖా గజ్వేల్ మాత్రం టెండర్లకు నేటీ వరకు దిక్కులేదు. గజ్వేల్ నియోజకవర్గంలో 93 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో 60 పాఠశాలల్లో పనులు నడుస్తుండగా మరో 33 పాఠశాలల్లో రూ. 30 లక్షల పైన చేపట్టే పనులకు నేటికి టెండర్లు వేసే నాథుడే దిక్కులేదు. దీంతో సిఎం ఇలాఖాలోనే మన ఊరు మన బడి పథకం పనులు ముందుకు సాగడంలేదు. ఒకవైపు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సిఎం సొంత నియోజకవర్గంతో పాటు ఇదే జిల్లా కావడంతో మన ఊరు మన బడి పథకం పనులను గజ్వేల్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. పనులు చేయడానికి టెండర్లే పూర్తి కాలేదని.. టెండర్లు పూర్తిచేసి పనులు త్వరగా ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. సిఎం ఇలాఖాలో టెండర్లు ఎప్పుడు పూర్తవుతాయో పనులు ఎప్పుడు ప్రారంభం అవుతాయో వేచి చూద్దాం మరి.

## విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్‌లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. జాతీయ ఉద్యమ అకాంక్షలకు రాజ్యాంగానికి ఫెడరల్ సూత్రాలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన జాతీయ నూతన విద్యా విధానం (ఎన్ఇపి) లోపాల పుట్ట అని, దీనిద్వారా విద్యావ్యవస్థ పెను ప్రమాదంలో పడుతుందన్నారు. దేశంలో విద్యా కార్పోరేటీకరణ, విద్యాకేంద్రీకరణ, విద్యాకాషాయికరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని మండిపడ్డారు. దీనిలో భాగంగానే ఎంఫిల్, పిహెచ్‌డి చేసే మైనార్టీ పరిశోధక విద్యార్థులకు మౌలానా అజాద్ పేరిట ఇచ్చే ఉపకార వేతనాలను రద్దు చేశారని అరోపించారు. దేశ భవిష్యత్తును నిర్దేశించే విద్యారంగాన్ని పాలక ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి అరకోర నిధులు కేటాయిస్తున్నాయన్నారు. దేశంలో జాతీయ నూతన విద్యా విధానం వలన దాదాపు 90 శాతం విద్యార్థులు నాణ్యమైన విద్య పొందే హక్కును కోల్పోతున్నారని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం మైనార్టీ విద్యార్థుల పట్ల వివక్ష చూపుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఇపిని రద్దు చేసి ప్రి మెట్రిక్ స్కాలర్ షిప్, మౌలానా అజాద్ ఉపకార వేతనాల రద్దు నిర్ణయాన్ని భేషరతుగా ఉపసంహరించుకోవాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ భాధ్యులు మంద పవన్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేరిపోతుల జనార్దన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సంగెం మధు, జిల్లా అధ్యక్షులు చిట్యాల శేఖర్, నాయకులు రామగళ్ల నరేష్, పూజిత, వర్శిని, వేల్పుల శ్రీనివాస్, బెక్కంటి సంపత్, బోనగిరి శ్రావణ్, మిట్టపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు దేశంలో తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా అమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## రోడ్డు వెడల్పుకు స్థానికులు సహకరించాలి

**పటాన్‌చెరు, జనవరి 3, ప్రభాతవార్త:** 113వ డివిజన్ పటాన్‌చెరు పరిధిలోని గౌతమ్‌నగర్ కాలనీలో జరుగుతున్న నూతన సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఉదయం కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ పరిశీలించారు. రోడ్డు వెడల్పుకు అడ్డుగాఉన్న విద్యుత్ స్తంభాలను, అరుగులను తొలగించాలని అన్నారు. అరుగుల తొలగింపు విషయమై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయగా కార్పొరేటర్ మాట్లాడుతూ సరైన రోడ్లు ఉంటేనే కాలనీల అభివృద్ధి సాధ్యమని అన్నారు. తమ పరిధి దాటి ముందుకు జరిగి నిర్మించిన, రోడ్డు వెడల్పుకు అడ్డుగా ఉన్న అరుగులు, గోడలు తొలగించడం జరుగుతుందని, దయచేసి స్థానికులు సహకరించాలని కోరారు. రోడ్డు నిర్మాణ పనులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైన తనను సంప్రదించాలని సూచించారు.

## ఎర్రకోటపై ఎగిరేది గులాబీ జెండానే : ఎమ్మెల్యే

**రామచంద్రాపురం, జనవరి 3, ప్రభాతవార్త:** మహోజ్వలమైన భారత నిర్మాణం ముఖ్యమంత్రి కెసిఆర్ లక్ష్యమని, అందుకే బిఆర్ఎస్ ఏర్పాటు చేసినట్టు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు రామచంద్రాపురం డివిజన్ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ తో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాత్రికేయులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమాన్ని ఒంటరిగా ప్రారంభించి, 14 ఏళ్ళు పోరాటం చేసి కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ సాధించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి అన్నిరంగాల్లో ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో దేశంలోనే తిరుగులేని శక్తిగా భారత రాష్ట్ర సమితి ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బిజెపిపై ఇరత పార్టీలకు దేశ ప్రజలు నమ్మే స్థితిలో లేరని, రాబోయే కాలంలో ఎర్రకోటపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బూరుగడ్డ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి దుబ్బాక అసెంబ్లీ పాలఖ్‌గా అంజిరెడ్డి

**రామచంద్రాపురం, జనవరి 3, ప్రభాతవార్త:**

భారతీయ జనతా పార్టీ దుబ్బాక అసెంబ్లీ పాలఖ్‌గా బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఎన్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో సి అంజిరెడ్డిని మంగళవారం రాష్ట్ర బిజెపి అధిష్టానం నియమించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర బిజెపి రాష్ట్ర పార్టీ నా మీద నమ్మకంతో సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం అసెంబ్లీ పాలక్‌గా నియమించినందుకు రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన్న బాధ్యతనను సమర్ధవంతంగా నిర్వహిస్తానని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి జెండా ఎగిరి, ప్రభుత్వ ఏర్పాటు ఏయడం ఖాయమని అంజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## మైనార్టీల కార్పొరేషన్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి
### మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్

**నర్సాపూర్, జనవరి 3 ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు సిక్కులు, పార్శీలు, బౌద్దులు జైనులకు మైనార్టీ కార్పొరేషన్ ద్వార రుణాలను అందజేస్తుంది. ఈమేరకు నర్సాపూర్ మున్సిపాలిటీ పరిదిలో ఉన్న మైనార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ మున్సిపల్ కమీషనర్ వెంకట్ గోపాల్ సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ 2023, 2024 సంవత్సరానికి గాను రుణాలను రెండు రకాల కెటగిరిగా విడుదల చేశారని తెలిపారు. కెటగిరి 1 ప్రకారం రుణం లక్ష వరకు ఉండగా యూనిట్లఉ 3 ఏర్పాటు చేయాలని ఇందకు 80 శాతం సబ్సీడి ఉంటుందన్నారు. అదేవిదంగా 2 వకెటగిరి ప్రకారం రుణం 2 లక్షలు రెండు యూనిట్లు ఉండగా 70 శాతం సబ్సీడి ఉంటుందని తెలిపారు.ఓబిఎంఎంఎస్ వెబ్ పెట్రోల్ సైట్ లో మైనార్టీ కార్పొరేషన్ లోన్ 2023, 2024 సంవత్సరం కు గాను ఆన్‌లైన్ లో దరఖాస్తులు చేసుకొని ఒక దరకాస్తు నర్సాపూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో సమర్పించాలని కమీసనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు.

## '10' విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్**

**దుబ్బాక, జనవరి 3, ప్రభాత వార్త:**



విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

మండలంలోని హబ్సీపూర్ గ్రామంలోగల మహాత్మ జ్యోతిబాపూలే బిసి సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ మంగళవారం సందర్శించారు. గురుకుల పాఠశాల ఇంటర్మీడియట్‌కి అప్‌గ్రేడ్ అయినందున ప్రస్తుతం ఉన్న ప్రాంతంలో గదుల కొరత ఏర్పడుతుందనే విషయాన్ని బిసి సంక్షేమ శాఖ జిల్లా అధికారి సరోజ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులు కలెక్టర్‌కు ఘనస్వాగతం పలికారు.తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతూ వసతిగృహంలో సదుపాయాలు బాగున్నాయా అని అడగ్గా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కరిస్తామని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం అందించడం జరుగతుందన్నారు. 10వ తరగతి విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు రోజు చన్నీటితో స్నానాలు చేస్తుండడంతో వాటర్‌హీటర్లను బిగించాలని ఆయన అధికారులకు సూచించారు గురుకుల పాఠశాలకు శాశ్వత భవనానికి 5 ఎకరాల స్థలాన్ని కేటాయించగా ఇప్పటివరకు ఎలాంటి పని జరగలేదని కలెక్టర్‌కి తెలిపారు. ఇప్పటివరకు భవనం నిర్మాణం కాలేదని ఎందుకు అడగలేదని సిఎం కేసిఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కాబట్టి ఇక్కడిప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.

భవనం పూర్తి కావడానికి 3 సంవ త్సరాలు పడుతుండడంతో ఇప్పుడున్న భవనంలోనే తాత్కాలికంగా అదనపు గదులు రూపొందించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న భవనంపై 6 గదులు, భోజనశాల, పాఠశాల వెనుక భాగంగలో మరుగుదొడ్లకు ప్లానింగ్ రూపొందించి ఎస్టిమెట్ తయారుచేసి 2 రోజుల్లోగా తనదగ్గరికి తీసుకు రావాలని పంచాయతీరాజ్ ఏఈ రిజ్వాన్‌కు ఆదేశాలు జారి చేశారు. వెంటనే తాత్కాలిక ఏర్పాట్లకి సంబంధించిన ఉత్తర్వులను బడ్జెట్‌ను సంబంధిత నిధుల నుండి మంజూరు చేస్తానని తెలిపారు. తరగతి గదులను, వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మళ్లీ వసతి గృహాన్ని సందర్శింస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆస్క శ్రీనివాస్, జడ్పిటిసి కడతాల రవిందర్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్‌సిఓ ప్రభాకర్, ఎంపిడిఓ భాస్కరశర్మ, ఎంపిఓ నరేందర్ రెడ్డి, ఏపిఎం శాంసుందర్‌రెడ్డి, ఎంఈఓ ప్రభుదాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.



విజ్ఞాన సదస్సును పరిశీలిస్తున్న సివిల్ జడ్జి సూరికృష్ణ

## పట్టణంలో తొలిమెట్టు విజ్ఞాన సదస్సును పరిశీలించిన సివిల్ జడ్జి సూరికృష్ణ

**జహీరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** పట్టణంలోని మెథడిస్ట్ పాఠశాలలో మంగళవారం తొలి మెట్టు విజ్ఞాన సదస్సు ను నిర్వహించారు. జహీరాబాద్, మగుడంపల్లి మండలాల ప్రభుత్వ విద్యా సంస్థల ఆధ్వర్యంలో సంయుక్తగా సదస్సు ను నిర్వహించారు. సదస్సు ను జహీరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి సూరి కృష్ణ హాజరై సదస్సు ను పరిశీలించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు అంశాలను జడ్జి ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తూ ఉంటారన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను ఆర్జించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది మాణెన్న, ఎంఇఓ బస్వరాజ్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఏఎంసి చైర్మన్



కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న ఏఎంసి చైర్మన్ శ్రీనివాస్

**గజ్వేల్, జనవరి 3 (ప్రభాతవార్త):** సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జీవన్ పాటిల్‌ను మంగళవారం గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్, మర్కుక్ మండల అధ్యక్షులు బెండె మధు, మొర్సు కర్ణాకర్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరుకు చంద్రమోహన్‌రెడ్డిలు కలిసి పుష్పగుచ్చం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల సహాయసహకారాలతో జిల్లాను అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేద్దామని అన్నారు. సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావుల ప్రోత్సాహంలో జిల్లా అభివృద్ధిలో అగ్రగామిగా ఉందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో అందరం కలిసి పనిచేద్దామన్నారు.

## అధ్వానం మావినెల్లి రోడ్డు



కంకర తేలని మాయినెల్లి రోడ్డు

**నాగల్‌గిద్ద, జనవరి 3, ప్రభాతవార్త:** మండలంలోని మావినెల్లి గ్రామానికి రోడ్డు అధ్వానంగా మారడంతో గ్రామస్థులు ప్రయాణానికి ప్రయాస పడాల్సి వస్తోంది. గ్రామానికి గతంలో వేసిన రోడ్డు పూర్తిగా తేలిపోవడంతో రోడ్డు ప్రయాణం ప్రమాదకరంగా మారిందని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. రోడ్డుపై కంకర తేలిపోవడంతో వాహనాల ప్రయాణం ప్రమాదకరంగా మారిందని, వాహనాలు తరుచూ చెడిపోతున్నాయని, ప్రయాణంలో ప్రమాదాలకు గురై ఆస్పత్రులలో చికిత్స లు అందుకోవాల్సి న దుస్థితి దాపురించిందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు మావినెల్లికి పోవాలంటే జంకుతున్నారని, ఫలితంగా వ్యవసాయం, వ్యాపారాలు కుంగిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని గ్రామసుక్థలు వినతి చేస్తున్నారు.

## బిజెపి ఓబిసి మోర్చా శిక్షణ తరగతులను విజయవంతం చేయండి
### బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్

**నర్సాపూర్, జనవరి 3 ప్రభాతవార్త:** ఈ నెల 6న మెదక్ పట్టణంలోని ద్వారకా ఫంక్షన్ హాల్‌లో బిజెపి ఒబిసి మోర్చా ఆధ్వర్యంలో కార్యకర్తలకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ఈ ప్రశిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లోని బిజెపి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలో సిఎం కెసిఆర్ రాక్షస పాలన కొనసాగిస్తు బిసిలను అనగదొక్కుతుందన్నారు.తెలంగానా ఉధ్యమంలో బిసిలు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పాల్గొనగా వారికి ఎటువంటి ఆదరణ లేదన్నారు. బిసిలకు అరచేతిలో వైకుంఠం చూయిస్తు న్నాడని కెసిఆర్ పై మండిపడ్డారు. అధికంగా జానాబా ఉన్న బిసిలకు ఎటువంటి పథకాలు అందించడం లేదన్నారు. కులవృత్తులను పట్టించ యుకోవడం లేదని వారికి పనిముట్ల ను పంపిణీ చేయడం లేదన్నారు. బిసిలకు జరుగుతున్న అన్యాయాలను వ్యతిరేకవిదానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి కార్యకరక్తలకు ఈ ప్రశిక్షణతరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు సిఎం కెసిఆర్ ను గద్దెదింపే శక్తి బిజెపి పార్టీకే ఉందన్నారు. బిసిల నందరిని చైతన్య పరిచి కెసిఆర్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పీకేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని గద్దెదింపి బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చి డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి ఓబిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ తో పాటు ఓబిసి జిల్లా అధ్యక్షులు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్, మండల బిజెపి అధ్యక్షులు నర్సింగరావునాయక్, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, ఓబిసి మోర్చా నాయకులు ప్రవీణ్, వెంకట్ ,విజయ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల ధర్నా రాస్తారోకో



నర్సాపూర్ చౌరస్తాలో ధర్నా రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**నర్సాపూర్, జనవరి ఆ ప్రభాతవార్త:** తెలంగాణా ప్రభుత్వం గ్రామ పంచాయతీనిధులు దారి మళ్ళించి స్థానిక సంస్థ హక్కులను నిర్వీర్యం చేస్తుండటపై నర్సాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు కన్నెర్ర చేశారు. ఇందుకు నిరసనగా నర్సాపూర్‌లోని చౌరస్తాలో ధర్నా రాస్తారోకొ నిర్వహించారు. ఈ ధర్నాతో వచ్చిపోయే వాహనాలు నిలిచిపోగా ట్రాఫిక్‌కు కొంత సేపు అంతరాయం కలిగింది. ఈ మేరకు ఎస్ గంగరాజు జోక్యం చేసుకొని ఈ ధర్నాను విరమింపచేశారు. ఈ సందర్బంగా కాంగ్రెస్ టిపిసిసి రాష్ట్ర నాయకులు ఆంజనేయులుగౌడ్, మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వార వచ్చిన గ్రామ పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి సర్పంచ్‌లయొక్క అధికారాలు దెబ్బతీసి నిరంకుశ పాలన కొనసాగిస్తుందని అన్నారు. సర్పంచ్‌లకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ధర్నాకు వెళుతుండగా అక్రమంగా అరెస్ట్ చేశారని అన్నారు. ఇందుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ ధర్నాలు నిర్వమిస్తున్నట్లు తెలిపారు. కాగా ప్రభుత్వం సర్పంచ్‌లకు తీవ్ర అన్యాయం చేసి వారి మనోబావాలను దెబ్బతీసిం దన్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీల ఖాతాలో జమ చేసిన నిదులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లకు మద్దతుగా నిలుస్తుందని పేర్కొంటు నిధులు విడుదల చేయని పక్షంలో పార్టీల కతీతంగా అందరి సర్పంచ్‌లను ఏకం చేసి ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. అంతేగాక ఎక్కడి కక్కడ మంత్రులను, ఎమ్మెల్యేలను నిలదీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి నాయకులు ఆంజనేయులు గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు రిజ్వాన్, మండల అధ్యక్షులు మల్లేషం, పట్టణ అద్యక్షులు ఆంజనేయులుగౌడ్, మాజీ సర్పంచ్ అశోక్, రెడ్డిపల్లి ఉప సర్పంచ్ అశోక్‌గౌడ్, నాయకులు భరత్‌రాజ్‌గౌడ్, శ్రీశైలంయాదవ్, రశీద్ బ్రాహ్మణపల్లి నర్సింలు, ఆనంద్, శివప్రసాద్‌గౌడ్, శ్రీపతి , దశరత్‌గౌడ్, శేఖర్‌గౌడ్, దాడిగె నరేశ్, పాల్గొన్నారు.



దౌల్తాబాద్‌లో సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న దృశ్యం

## చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి

**హత్నూర, జనవరి 3, ప్రభాతవార్త:** మండల పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. దౌల్తాబాద్, ముచ్చర్ల గ్రామాలలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలువేసి ఘనంగా నివాళులర్పించారు. దౌల్తాబాద్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వివిధ వర్గాలకు చెందిన నాయకులు సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ పార్టీ నాయకులు శాంతికుమార్, ఎంఆర్‌పిఎస్ నాయకులు కె నగేష్, మల్లేశ్, దత్త గౌడ్, భాస్కర్, శంకరయ్య, అశోక్, ఎర్రోళ్ల గంగాయ్య, పి సత్తాయ్య తదితరులు పాల్గొన్నారు. ముచర్లలో తెలంగాణ ప్రజా హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలె జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ అధ్యక్షులు మీనంపల్లి శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి ముచ్చర్ల నగేష్, మీనంపల్లి ప్రభాకర్, నందు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపేటనలో...**



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**నిజాంపేట, జనవరి 3, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని నూతన బస్టాండ్ సమీపంలో మంగళవారం గ్రామ ఉపసర్పంచ్ కొమ్మాట బాబు ఆద్వర్యంలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మి, గర్గుల సుధాకర్, జాల పోచయ్య, సిద్దరామరెడ్డి, చల్మెడ ఎంపిటీసీ బాల్‌రెడ్డి, రెడ్డిశెట్టి రవీందర్, మావురంరాజు, బిజ్జ సంపత్, ఎమ్మార్పిఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గర్గుల శ్రీనివాస్, ఆముద రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మల అశ్విని శ్రీనివాస్ దంపతులకు సన్మానం



పోచమ్మల అశ్విని దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

**రామాయంపేట, జనవరి 3, ప్రభాతవార్త :** సావిత్రిబాయిపూలే 192వ జయంతి కార్యక్రమం బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస గౌడ్ ఆద్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన వేడుకలలో రామాయంపేట పట్టణానికి చెందిన మెదక్ జిల్లా సావిత్రిబాయి పూలే సంఘం అధ్యక్షురాలు పోచమ్మల అశ్విని శ్రీనివాస్ దంపతులను ఆహ్వానించి సన్మానించి, మెమెంటో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ కమిషన్ చైర్మెన్ వకులాభరణం, కృష్ణ, రామ్మోహన్ మెమొంటో అందుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సావిత్రిబాయి పూలే రాష్ట్ర సంఘం అధ్యక్షురాలు బెల్లం మహాదేవి సన్మానించినట్లు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల అరెస్టు



పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

**రామాయంపేట, జనవరి 3, ప్రభాతవార్త :** రేవంత్‌రెడ్డిని అరెస్టుకు నిరసనగా మంగళవారం రామాయంపేటలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకులను స్థానిక ఎస్ఐ రంజిత్ వారిని అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్యామ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చింతల యాదగిరి, ఎంపిటీసీ మల్లన్నగారి నాగులు, పట్టణ కార్యదర్శి అల్లాడి వెంకట్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

## పీఆర్‌టీయూ టీఎస్ 2023 కాలమానిని ఆవిష్కరణ



క్యాలెండర్ విడుదల చేస్తున్న దృశ్యం

**రామాయంపేట, జనవరి 3, ప్రభాతవార్త :** పీఆర్‌టీయూ టిఎస్ ఆద్వర్యంలో 2023 కాలమానిని స్థానిక తహశీల్దార్ అబ్దుల్ మనన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అద్యక్ష, కార్యదర్శులు మరిపల్లి నర్సాగౌడ్, లోలక్‌పురి సురేష్, రాష్ట్ర అసోసియేట్ అద్యక్షుడు బత్తుల ఆశయ్య, ప్రమోద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోరెడ్డి యాదవరెడ్డి, మాస్న శ్రీనివాస్, మండల అసోసియేట్ అధ్యక్షులు పిన్నం శ్రీనివాస్, కవిత, వేణుగోపాల్‌తో పాటు మండల మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళా రక్షణపై అవగాహన సదస్సు

**నిజాంపేట, జనవరి 3, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని నూతన బస్టాండ్‌వద్ద మంగళవారం షీ టీమ్ ఇంచార్జి ఏఎస్ఐ లక్ష్మీ ఆద్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ మహిళా రక్షణకై మహిళల కోసం షీ టీం ఏర్పాటు చేయడం జరిగిందని, మహిళలకు ఎలాంటి ఆపదలో ఉన్న పోలీసువారిని సంప్రదించాలన్నారు. అదేవిధంగా ఆపద సమయంలో 100 డయల్‌చేస్తే అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కొమ్మాట బాబు, బిజ్జ సంపత్, ఎంపిటీసి బాల్‌రెడ్డి, రాజు, సుధాకర్, శ్రీనివాస్, పోచయ్య, సిద్దరామిరెడ్డి, పోలీస్ సిబ్బంది కిరన్, రజాక్, విజయ్, పాల్గొన్నారు.

## మండల వైద్యాధికారిగా సింధు

**చిన్నశంకరంపేట, జనవరి 3, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండల వైద్యాధికారిగా వైద్యురాలిగా సింధు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన వైద్యురాలు శ్రావణి పీజీ విద్యను అభ్యసించడానికి సెలవుపై వెళ్లగా, కామారెడ్డి జిల్లా బిక్కనూర్ పిహెచ్‌సి నుండి బదలిపై వైద్యురాలు సింధు వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తానని ఆమె తెలిపారు.

## సంగారెడ్డి మాస్కుల పంపిణీ

**పటాన్‌చెరు, జనవరి 3, ప్రభాతవార్త:** పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలు వసుంధర చేతుల మీదుగా రోగులకు మాస్కులను మాల మహానాడు అధ్యక్షుడు నిరుడి వీరాస్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ ప్రజలందరూ కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలకు సూచించారు.

## సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి

**-ఎమ్మెల్యే మహేష్ రెడ్డి,డిసిసిబి చైర్మన్ మనోహర్ రెడ్డి**

**చౌడాపూర్ జనవరి3,ప్రభాతవార్త :** ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి జరుగుతుందని దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్ర అందిస్తుందని మిగతా రాష్ట్రాలకు తెలంగాణ రాష్ట్ర ఆదర్శంగా నిలుస్తుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్ర తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కళ్యాణల క్ష్మి,షాదీ ముబారాక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మె ల్యే మహేష్ రెడ్డి, ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 42మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. మనోహర్ రెడ్డి మాట్లాడుతూ…కళ్యాణలక్ష్మి,షాదీముబారాక్ లాంటి పథకంతో ఆడబిడ్డలకు వివాహ కానుకగా సిఎం కెసిఆర్ పేద వారికి అండగా ఉన్నారని రాష్ట్రంలో ఎన్నో సం క్షేమ పథకాలతో ప్రజల ఆర్థికస్థితి మెరుగుపరిచేందుకు బిఆ ర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపా రు. ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు సుధాక ర్ రెడ్డి, ఎంపిపి సత్య హరిచంద్ర, జడ్పిటిసి రాందాస్, తహ సిల్దార్ అశోక్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ నాగరాజు, సర్పంచ్ రంగారెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రాజు, ఎంపిటిసి శంకర్, ఏఎంసి చైర్మన్ బృంగి హరికృష్ణ, ఎస్ఏ వెంకట గిరి, మందిపాల్ వెంకట్, మేఘ్య నాయక్ ,అశోక్, యాద య్య, రాజప్ప, పాల నర్సింలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండ

**బొంరాస్‌పేట్, డిసెంబర్3, ప్రభాతవార్త :** పేద కుటుంబాలకు కొండంత అండ ముఖ్యమంత్రి సహాయ నిధి అని బొంరాస్‌పేట్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నా రు. మంగళవారం నాడు బొంరాస్‌పేట్ మండలం బొట్లోని తాండ గ్రామపంచాయతీలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు తాండకు చెందిన లబ్ధిదారుల ఇంటికి వెళ్ళి ఎల్ఓసీ ద్వార రామవత్ హన్మ్యానాయక్ తండ్రి సేవ్యానాయ క్‌కు 83వేల రూపాయాల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు ను బిఆర్ఎస్ నాయకులు అందించడం జరిగిందన్నారు. పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా ఉంటుందన్నారు. అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు వైద్యంకు అయ్యే ఖ ర్చును ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నేహ్రూ నాయక్, కలునాయక్, దేశ్యానాయక్, బాలునాయక్, రవినాయక్, చందర్‌నాయక్, రమేష్‌నాయక్, పాల్గొన్నారు.

## అర్బన్ హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలు తీర్చాలి

**ఘట్‌కేసర్, జనవరి 3, ప్రభాతవార్త:** ప్రభుత్వ వసతిపాఠశాలలో విద్యార్థులు సమస్యలతో ఇబ్బం దులు పడుతున్నా అధికారులు స్పందించకపోవడం సరికాద ని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థు లతో మాట్లాడిన ఆయన పలు సమస్యలను అడిగి తెలుసు కున్నారు. మెను ప్రకారం పిల్లలకు బోజనం అందించడం లేదని, కూరగాయలు నీళ్ల లాగా ఉన్నాయని, మూడు నెల లు నుంచి పాలు, గుడ్లు ఇవ్వడం లేదని ఆయన గుర్తించా రు. భోజనానికి సంబంధించిన బిల్లు గత 8 నెలలుగా రాలేదని విద్యాశాఖ అధికారులు సకాలంలో బిల్లులు మం జూరు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లను పరిశీలించి నిర్వహణ సక్రమంగా చేయాలని సూచించారు. హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలపై ప్రత్యేకాధికారి మాధవిని ఎంపిపి ప్రశ్నించారు. జిల్లా అధి కారులు పాఠశాలను సందర్శించి ఇక్కడ సమస్యలు తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## పేదల పాలిట ఆపద్బాంధవుడు కెసిఆర్

**కుల్కచర్ల జనవరి 03,ప్రభాతవార్త** పేదల పాలిట ఆపద్బాందవుడు సిఎం కేసిఆర్ అని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి, డిసిసిబి చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారంవికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి,షాది ముబారక్ చెక్కులు అందజే శారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి,షాది ముబా రక్ పథకాలు పేద ప్రజలకు ఆసరాగా నిలుస్తున్నాయని వారు తెలిపారు. ముఖ్యమంత్రి కేసిఆర్ సహాయంతో ఎంతో మంది పేద కుటుంబాలకు పెళ్లిళ్ల భారం తగ్గిందని అన్నా రు. ఆడపిల్లల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదు అనే ఉద్దేశంతో సిఎం కేసిఆర్ పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సత్య హరిశ్చంద్ర, జడ్‌పిటిసి రాందాస్‌నాయక్, మార్కెట్ కమిటి చైర్మన్ బృంగి హరికృష్ణ, మాజి ఎంపిపి రాజప్ప, సర్పంచ్‌ల సంఘం మం డల అధ్యక్షుడు శంకర్‌నాయక్ మరియు బిఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### రెవెన్యూ అధికారుల కృషి ప్రశంసనీయం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి జనవరి 3, ప్రభాతవార్త** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని వివిధ మండలాల్లో కుల, ఆదాయ, నివాస తదితర ధృవపత్రాల జారీలో జిల్లాలోని రెవెన్యూ అధికారుల సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ హరీశ్ అభినందించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి ఛాంబర్‌లో ధృవపత్రాల జాబితాను ప్రకటించి ప్రశంసించా రు. 2022డిసెంబరు 24నుంచి సర్టిఫికెట్లు జిల్లాలోని అన్ని మండలాల్లో తహసీల్దార్లు నిర్ణీత సమయంలోపల అందిస్తున్నారని, నిర్ణీత కాలం దాటిన ధరఖాస్తు ఒకటి కూడ లేకపోవటాన్ని ఆన్‌లైన్‌లో పరిశీలించి అభినందించిన పత్రాన్ని ఆయన జారీ చేశారు. పెండింగ్‌లో లేకుండ అందిస్తున్నందుకు తహసీల్దార్లను, ఆర్డీఓలను ఇదే సంప్రదాయాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ ప్రగతిని సాధించటంలో చొరవచూపి మార్గనిర్దేశం చేసిన అదనపు కలెక్టర్ నర్సిం హ్మారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌ను ఈ సందర్బంగ అభినందించారు.

## నిబంధన ప్రకారం పనులు చేయాలి

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 03,(ప్రభాతవార్త):** ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేయాలని టెక్నికల్ అసిస్టెంట్ వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ముష్టిపల్లి, ఎదిర గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వార ఏర్పాటు చేస్తున్న నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలలో పనులు చేస్తున్న వన సేవక్‌లు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తు పనులు చేయాలని అన్నారు. మట్టి ప్యాకెట్లు నింపె పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్ అసిస్టెంట్లు అంజనేయులు, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

### కొడంగల్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**-మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి**

**కొడంగల్,జనవరి 3ప్రభాతవార్త** కొడంగల్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మున్సిపల్ చెర్మెన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్, కమీషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలతో కలసి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్బంగా 3వ వార్డు పాతకొడంగల్ వార్డు ప్రజలతో మాట్లాడి వారికి కావాల్సిన వసతు లను అడిగి తెలసుకున్నారు. అలాగే ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం అక్కడక్కడ పెండింగ్‌లో ఉన్న అభివృద్ది కార్యక్రమాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్‌తో పాటు సంభందిత అధికారులను ఆదేశించారు. అనంతరం నూతనంగా నిర్మించిన పాతకొడంగల్ టీటీడబ్ల్యుఆర్ బాలుర పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారికి కావాల్సిన వసతులను అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్దులకు వండుతున్న ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను పరిశీలించారు. అలాగే ప్రభుత్వం నుంచి పంపిణీ చేసిన స్కూల్ బ్యాగ్‌లు, బూట్లు విద్యార్దులకు అందజేశారు. కార క్రమంలో మున్సిపల్ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు కేవీ. రాజేందర్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే నాలుక చీరేస్తాం

**యాలాల జనవరి 3,ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ నాయకులు మతిభ్రమించి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షు డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారనిబిఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, హాజీపూర్ సర్పంచు శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. అరకర నిరాజకీయ పరిజ్ఞానంతో అవగాహన లేనిఆరోపణలు చేస్తే నాలుక చీరేస్తామని వారు హెచ్చరించారు. బిజెపి నాయకులు మీడియా సమావేశంలో బిఆర్ఎస్ అధ్యక్షుడిపై చేసిన ఆరోపణలను వారు మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో తీవ్రంగా ఖం డించారు. అటల్ బిహారీ వజ్‌పేయి జయంతి వేడుకలకు పిలిచి మోస పూరితంగా కోకట్ గ్రామంలో బిఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను బిజెపిలో చేర్పించుకోవడం ఆ పార్టీ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఆ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు దళితులను కించపరిచేలా వ్యాఖ్య లు చేయడం కారణంగానే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదయ్యిందనివారు గుర్తు చేశారు. అందుకుమండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డిని భాద్యులను చేయడం సిగ్గుచేటన్నారు. దళితులను కుక్కలతో పోల్చిన మురళీ దళితులకు భే షరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే యాలాల మండలంలో తిరగనివ్వమని వారు హెచ్చరించారు. పెద్దెముల్, తాండూరులో తదితర ప్రాంతాల్లో మురళీకృష్ణగౌడు లీలలు అందరికీ తెలుసనని వారు ఎద్దెవా చేశారు. దళితుల మద్య చిచ్చు పెట్టి రాజకీయాలు చేయడం మానుకోవాలని వారు హితువు పలికారు. మురళీకృష్ణ గౌడు చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. ఎన్కెపల్లి గ్రామంలో మురళి ప్రమే యంతోనే ఎమ్మెల్యే ఫ్లెక్సీపై అమానుషంగా వ్యవహారించారని వారు ఆరోపించా రు. బిజెపి పాలిత రాష్ట్రాలలో దళితులను పట్టించుకోవడం లేదని వారు ఆరోపించా రు. తెలంగాణ సర్కార్‌లో దళితబంధుతో పాటు రైతులకు రైతుబందు, రైతు భీమావం టి పథకాలను చేపట్టిందని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాఘవాపూర్ ఉప సర్పంచు నర్సిములు, మాణిక్యం, లాలప్ప, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## కుల వివక్షత చూపుతున్న ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలి

**పెద్దేముల్, జనవరి 3, ప్రభాతవార్త:** విద్యార్థుల పట్ల కుల వివక్షత చూపుతు, ఇబ్బందులకు గురిచేస్తున్న మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాయత్రిని విధుల వెంటనే తొలగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా మంగళవారం పెద్దేముల్ మండలం గొట్టపల్లి మాడల్ స్కూల్ విద్యార్థులు రొడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. కుల వివక్షత చూపుతున్న ప్రిన్సిపాల్ డౌన్ డౌన్ అంటు నినాదాలు చేశారు. విద్యార్థులు చేపట్టిన రాస్తారోకోకు పిడిఎస్‌యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాక్షులు దీపక్‌రెడ్డి, కేవిపిఎస్ జిల్లా సహ య కార్యదర్శి కోళ్ళ గోపాల్ మద్దతు తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ విద్యార్థులపట్ల కుల వివక్ష చూపుతున్న ప్రిన్సిపాల్ గాయత్రిపై ఉన్నతాధికారులు శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రవూఫ్ రాస్తారోకో స్థలికి చేరుకొని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ప్రిన్సిపాల్‌పై శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడాతామని చెప్పడంతో విద్యార్థులు, నాయకులు శాంతించి ధర్నాను విరమించారు. విద్యార్థుల పట్ల కులవివక్షత చూపిన ప్రిన్సిపాల్‌పై కేసునమోదు చేసి శిక్షించాలని పిడిఎస్‌యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాక్షులు దీపక్‌రెడ్డి, కేవిపిఎస్ జిల్లా కార్య దర్శి గోపాల్ డిమాండ్ చేస్తు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు.



కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన కాంగ్రెస్ నాయకులు

## కాంగ్రెస్ ధర్నాను అడ్డుకోవడం హేయమైన చర్య...

**నిజాంపేట, జనవరి 3, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల నిధుల విడుదల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని టీపీసీసీ ఆద్వర్యంలో తలపెట్టిన ధర్నాకి వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణుల అక్రమ అరెస్టుకు నిరసనగా నిజాంపేట మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగంగౌడ్ ఆద్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేసి, రోడ్డుపై బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవతిరేక నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఘటన స్థలానికి పోలీసు చేరుకొని కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్బంగా లింగంగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని నిధులు ఇవ్వకుండా వారిన పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టి ఆత్మహత్య చేసుకునే పరిస్థితి తీసుకొచ్చారని ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల నిధులను వారిక కేటాయించి సర్పంచులను ఆదుకోవాలన్నారు. తెలంగాణ సర్పంచులకు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అండగా ఉంటారని, సర్పంచులు అధైర్యపడవద్దని ఎల్లవేళలా సర్పంచులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దాత్రిక మారుతి, జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, మధుసూదన్‌రెడ్డి, నారాగౌడ్, నరేందర్, మెట్టు వెంకట్, రాజయ్య, మ్యాదరి రాజు, మహేష్, భూమయ్య, నర్సింలు పాల్గొన్నారు.

## మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్

**రేగోడ్, జనవరి 3, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో రేగోడ్ మండలంలోని పదో తరగతి విద్యార్థులకు "సాంఘిక శాస్త" (సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్) మంగళవారం నాడు నిర్వహించారు. రేగోడ్ హైస్కూల్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుండి 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు వేర్వేరుగా పరీక్ష నిర్వహించారు. 60 ప్రశ్నలు, 60 మార్కులు గల ఈ టెస్ట్‌లో తెలుగు మీడియం నుండి రేగోడ్ హైస్కూల్ బి విఘ్నేశ్, రేగోడ్ కెజిబివి టి అరుణ, టి లింగంపల్లి హైస్కూల్ జి కళ్యాణి, ఇంగ్లీష్ మీడియా నుండి రేగోడ్ మోడల్ స్కూల్ విద్యార్థులు వై మల్లీశ్వరి, ఎ అశ్విని, ఎస్ పూజ వరుసగా ఒకటి, రెండు మూడు స్థానల్లో నిలిచి మండల స్థాయి విజేతలుగా నిలిచారు. విజేతలకు ప్రశంసపత్రం, మెమోంటోలు అందజేశారు. ఈ నెల 7వ తేదీన మెదక్‌లో జరిగే జిల్లాస్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్‌లో వీరంతా పాల్గొంటారు. రేగోడ్ హైస్కూల్ సోషల్ టీచర్ అశోక్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయప్రకాశ్, రేగోడ్ హైస్కూల్ ఇంఛార్జి హెడ్ మాస్టర్ రమేష్, మండల ఉపాధ్యాయులు అజయ్ కుమార్, మంగ్యా నాయక్, ప్రతాప్, ఉదయ్ కుమార్, స్వప్న, మాధవి, శ్రీవాణి లు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులలో ప్రయాణించడం సుఖం..



మాలపాడు గ్రామానికి బస్సు ను ప్రారంభిస్తున్న దృశ్యం

**మునిపల్లి, జనవరి 3, ప్రభాతవార్త:** కరోనా ప్రభావంతో ఆర్టీసీకి దూరమైన ప్రజలకు సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ తిరిగి బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. బస్సులలో ప్రయాణం తగ్గించిన ప్రజలు ఇప్పుడు కరోనా తగ్గుముకం పట్టడంతో మళ్లీ బస్సులలో ప్రజలు ప్రయాణించడానికి మొగ్గు చూపుతున్నారు. ప్రజలు విజ్ఞప్తి మేరకు ఆర్టీసి యాజమన్యాం గ్రామాలకు బస్సులను పునరుద్దరిస్తుంది. ఇందులో భాగంగా సదాశివపేట నుండి వయా ఆత్మకూర్, బొబ్బిలిగామ, బుసారెడ్డిపల్లి, మాలపాడ్ వరకు బస్సుసౌకర్యాం కల్పించారు. చిన్న ఆటోలలో సామర్థ్యానికి మించి ప్రజలు ప్రయాణించడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతాయని, బస్సులలో ప్రయాణించడం సురక్షితమని సదాశివపేట బస్టాండ్ ఇంఛార్జ్ ప్రకాష్ అన్నారు. కార్యక్రమంలో ఆత్మకూర్ నుండి బొబ్బిలిగామ, బుసారెడ్డిపల్లి, మాలపాడు గ్రామల సర్పంచ్‌లు, సదాశివపేట బస్టాండ్ ఇంఛార్జ్ బి ప్రకాశ్, బస్సు డ్రైవర్ గూడ్‌సాబ్, కండక్టర్, ప్రజలు, ప్రయాణీకులు పాల్గొన్నారు.

## పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతన్న భాజాపా జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

**చిన్నశంకరంపేట, జనవరి 3, ప్రభాతవార్త:** రాబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని భాజాపా పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేట పట్టణంలోని భాజాపా పార్టీ కార్యాలయంలో భాజాపా పార్టీ మండల అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వివరాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో రాచర్ల అశోక్, విజయ్, దత్తు, ఆకుల రాజు, వనం నర్సింలు, మేడి స్వామి, మూర్తి శంకర్, మధు, సయ్యద్, మంజుల, నరేష్, ప్రవిణ్, అశోక్, భూపాల్, ధర్మారెడ్డి, మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుకాణాలు కూల్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

**కొత్తూర్, జనవరి 3, ప్రభాతవార్త :** దర్గాలో దుకాణాలను అక్రమంగా కూల్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు. కొత్తూర్ మండల పరిధిలోని జెపి దర్గాలో 40-50 ఏళ్ల నుండి చిరువ్యాపారులు దుకాణాలు పెట్టుకుని జీవన ఉపాధిని పొందుతున్న వారికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుం డా క్రషర్ వ్యాపారులతో కుమ్మకై అధికారులు షాపులను తొలగించి అధికారు లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రభుత్వాని న్ని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులకు సిపిఐ పార్టీ సహకరిస్తుం దని కానీ అధికారులు చట్టబద్ధంగా నోటీసులు ఇచ్చి ప్రభుత్వపరంగా పనులు చేపడితే మాకు ఎలాంటి అభ్యంతరం లేదని కానీ క్రషర్ మిషన్ యాజమా న్యాన్ని పోలీసులు ట్రాఫిక్ పోలీసులు పంచాయతీరాజ్ అధికారులు సపోర్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. దేనికైన ఒక ప్రొసిజర్ ఉంటుందని నిబంధ నల ప్రకారం చేసే పనులను సీపీఐ పార్టీ వ్యతిరేకించిందన్నారు. సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ..... సీపీఐ మండల కార్యదర్శి ఎండీ షకిల్ షాపుతో పాటు చిరువ్యాపారుల షాపులను తొలగించి పేదల బ్రతుకులను నడిరోడ్డుపైకి లాగడం బాధాకరమన్నారు. చిరు వ్యాపారులకు సీపీఐ పార్టీ అండగా ఉంటుందని, అవసరమైతే న్యాయ పోరాటం కూడా చేస్తామని తెలిపారు. ఈనిరసన కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎండీ షకిల్ ఎల్లయ్య, మైసయ్య, బాధితులు ఉన్నారు.

# ఎంపీడీవో తహసిల్దార్ కార్యాలయాల నిర్మాణాలు ఎప్పుడు?

**గుమ్మడిదల, జనవరి 3, ప్రభాతవార్త:** నూతన మండల కేంద్రంలో ఎంపీడీవో, తాహసిల్దార్ కార్యాలయాల నిర్మాణాలకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసి సుమారు ఆరు నెలలు గడిచిన నిర్మాణాలను చేపట్టకపోవడం సోచనీయమని తెలుగుదేశం పార్టీ మండల తెలుగు యువత అధ్యక్షుడు పోచుగారి శ్రవణ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రత్యే చొరవ తీసుకొని నూతన మండలాన్ని ఏర్పాటు చేసినప్పటికి ఎంపీడీవో, తాహసిల్దార్ భవన నిర్మాణాలు చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులకు ఇప్పజెప్పినప్పటికి ఎలాంటి నిర్మాణాలు చేపట్టకోవడంతో మండలంలోని వివిధ పార్టీల నాయకులతో పాటు రైతులు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేధనవ్యక్తం చేశారు. ఈ సందర్బంగా తెలుగు యువత మండల అధ్యక్షుడు పోచుగారి శ్రవణ్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రజల సమస్యలనను వెంటనే పరిష్కరించడానికి సొంత భవనాలు ఎంతైనా అవసరమని ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధతో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం తాహసిల్దార్ సుజాత ప్రత్యేక చొరవ తీసుకొని స్థలం కేటాయించనప్పటికి నిర్మాణంలో మండల బిఆర్ఎస్ నాయకులు నిర్మాణం పనులను వెంటనే నిర్మాంచాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆదేశించినప్పటికి బేకాదర్ చేస్తూ ఇప్పటివరకు నిర్మాణాల్లో ఎటువంటి చర్యలు జరగకపోవడంతో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని భవనాల నిర్మాణాలను వెంటనే చేపట్టే విధంగా, సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డిపిఒకు పూల మొక్కను అందజేస్తున్న ఈ-పంచాయతీ ఆపరేటర్లు

## డిపిఓను కలిసిన ఈ-పంచాయతీ ఆపరేటర్లు

**జగదేవ్‌పూర్, జనవరి 3(ప్రభాతవార్త):** సిద్దిపేట జిల్లాలోని అన్ని మండలాలలో పనిచేస్తున్న ఈ-పంచాయతీ ఆపరేటర్లు ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారిణి దేవకిదేవిని కలిసి పూల మొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఈ-పంచాయతీ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు నవీన్ గౌడ్, కార్యదర్శి బి.నర్సింలు మాట్లాడుతూ ఈ పంచాయతి ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఈ-పంచాయతీ ఆపరేటర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు వెంకటరాజి రెడ్డి, కోశాధికారి సంతోష్‌కుమార్, సంఘం సభ్యులు బాలకృష్ణారెడ్డి, స్వామి, పరశురాం, రాజేందర్, నవీన్, సోయెల్, కృష్ణ, ఎల్లయ్య పాల్గొన్నారు.

## విద్యార్థినిలను అభినందించిన ఎస్ఐ



విద్యార్థినిలను సన్మానిస్తున్న ఎస్ఐ మహేందర్

**దుబ్బాక, జనవరి 3, ప్రభాతవార్త:** పట్టణ పరిధిలో ధర్మాజీపేటలో ప్రభుత్వం ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ఇటీవల ఒరిస్సాలో జరిగిన జాతీయస్థాయి టెన్నిస్ వాలీబాల్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించి, జాతీయస్థాయిలో రాణించిన విద్యార్థినిలు డి. అక్షయ, కె. అక్షయ, పాఠశాల పీఈటీ నరేష్‌లను మంగళవారం దుబ్బాక ఎస్ఐ బత్తుల మహేందర్ శాలువాతో సన్మానించి అభినంధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు మంచి మార్గంలో నడుచుకొని విజయాలు సాధించాలన్నారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూచనపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎంపిటిసి జయలక్ష్మి

**హుస్నాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామంలో పందిల్ల గ్రామ ఎంపిటిసి సభ్యురాలు బాణాల జయలక్ష్మి ప్రారంభించారు.ఇందులో మొత్తం 22టీమ్‌లు పాల్గొంటాయని తెలుపుతూ ఇట్టి క్రీడల ఫైనల్‌మ్యాచ్‌ను ఈ నెల 13న నిర్వహిస్తారని చెప్పారు.ఈ కార్యక్రమంలో బిజెవైఎం అధ్యక్షులు జాప శ్రావణ్‌రెడ్డి,ట్రస్ట్‌చైర్మన్ మడప పెద్దిరెడ్డి,వార్డుసభ్యులు రవిందర్‌రెడ్డి,క్రికెట్‌క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియుటిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

**చేర్యాల, జనవరి 3, ప్రభాతవార్త :** పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్లో పిఆర్‌టియుటిఎస్ క్యాలెండర్లను ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. చేర్యాల మండల అధ్యక్షులు జంగ శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కెవిఎన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.మంజు భార్గవిచే ఆవిష్కరించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పి.రాజయ్య, జిల్లా కార్యదర్శి రామరాజు, ఉపాధ్యాయురాలు మాధవరెడ్డి, పరమేశ్వరయ్య, శుభాకర్‌రెడ్డి, మమత, ఉమాదేవి, సాజిదా, సుజాత తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయి



మాట్లాడుతున్న దేశబోయిని నర్సింలు

**గజ్వేల్, జనవరి 3 (ప్రభాతవార్త):** క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుడ్యంతో పాటు స్నేహ సంబంధాలు పెంపొందుతాయని జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యుడు దేశబోయిని నర్సింలు పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ఐటిసి వెనకాల గ్రౌండ్‌లో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రధానమంత్రి కప్ టోర్నమెంట్‌ను ఆయన టాస్‌వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లు నగరాలకే పరిమితం కాకుండా గ్రామాల్లోనూ జరిపినట్లయితే మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. గజ్వేల్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి చంద్రప్రసాద్ మాట్లాడుతూ డిసెంబర్ 28న ప్రారంభమైన ఈ టోర్నమెంట్ ఈనెల 12 వరకు కొనసాగుతుందన్నారు. టోర్నమెంట్‌లో గజ్వేల్ సిఐ వీరప్రసాద్, తొగుట సీఐ కమలాకర్‌లు పాల్గొని ఆడడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజుయాదవ్, క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు అశోక్, రవీందర్‌చౌహాన్, శ్రీకాంత్, కాజాపాషా, ఎంఎస్.యాదవ్, రవీందర్‌రెడ్డి, నీరుడి రమేష్, గుమ్మడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టడుగు వర్గాలలో విజ్ఞానాన్ని నింపిన మహనీయురాలు సావిత్రిబాయిపూలే

**జగదేవ్‌పూర్, జనవరి 3 (ప్రభాతవార్త):** నిమ్న వర్గాల అభ్యున్నతి కొరకు కృషి చేస్తూ భారతీయ సంఘ సంస్కర్తగా, ఉపాధ్యాయినిగా, రచయిత్రిగా పనిచేసి అట్టడుగు వర్గాలలో విజ్ఞానాన్ని నింపిన మహానుభావురాలు సావిత్రిబాయిపూలే అని జగదేవ్‌పూర్ మండల ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాగుల రాజు అన్నారు.మంగళవారం సావిత్రి బాయిపూలే 192వ జయంతి ఉత్సవాల సందర్భంగా హైద్రాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన జ్యోతిప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మండల ముదిరాజ్ యూత్ అధ్యక్షుడు హేమ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కొమురవెల్లిలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



హుస్నాబాద్‌లో సావిత్రీబాయిపూలేకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



గజ్వేల్‌లో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కొహేడలో సావిత్రబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

# సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

**కొమురవెల్లి/చిన్నకోడూరు/బెజ్జంకి, జనవరి 3, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని ఐనాపూర్ ప్రాథమిక పాఠశాలలో సంఘసంస్కర్త, స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప మహనీయురాలు, మాతా సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలను తెలంగాణ సాంస్కృతిక సారధి కవి కళాకారుడు పిన్నింటి రత్నం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ స ందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిని జీవితాల్లో కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బావండ్లపల్లి రాకేష్, గీత, విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**బెజ్జంకిలో...**

అక్కర జ్ఞానంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని అరుణోదయ సాంస్కృతిక సారథి విమలక్క అన్నారు. మంగళవారం మహాత్మా సావిత్రిబాయిపూలే 192వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో పూలే దంపతులు ఉత్సవ కమిటీ అధ్యక్షులు పెద్దోళ్ల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. మహిళలకు విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగిన గొప్ప మహనీయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. ఆహార భద్రత కమీషన్ సభ్యులు వోరుగంటి అనంద్ తదితరులు మాట్లాడారు. అంతకుముందు పూలే దంపతులు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ద్యావనపల్లి మంజుల, ఎంపిడిఓ దమ్మని రాము, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అరుణోదయ సాంస్కృతిక సారథి విమలక్కను శాలువాలతో సత్కరించారు.

**చిన్నకోడూరులో...**

మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోలీసుస్టేషన్ సమీపంలోగల మహాత్మాజ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు ఎంపిపి కూర మాణిక్యరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు కాముని ఉమేష్‌చంద్ర, మేడికాయల వెంకటేశం, ములకల కనకరాజు, కొండం వనితరవీందర్‌రెడ్డి, కుంటయ్య, మద్దికుంట నవీన్, శ్రీకాంత్, గుడుమల్ల రాజలింగం, గుజ్జ రాజు, నముండ్ల శ్రీకాంత్, రాజశేఖర్, పంపరి కనకయ్య, చెరుకు నారాయణ, బెజ్జంకి తిరుపతి, ఎల్క అనిల్, కదారి వినయ్, బబ్బురు బాలక్రిష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...**

కాగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మహాత్మాజ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు సుంచు రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మిట్టపల్లి గణేష్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి కనకరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చెరుకు నారాయణ, బబ్బురు బాలక్రిష్ణ, అంకార్ మధు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

**హుస్నాబాద్‌లో...**

**హుస్నాబాద్, జనవరి 3, ప్రభాతవార్త**

హుస్నాబాద్ పట్టణంలో సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్నతో పాటు పలువురు పాల్గొన్నారు. హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో సావిత్రీబాయిపూలే జయంతి కార్యక్రమాన్ని అంబేద్కరిస్టు ముక్కెర సంపత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ జ్యోతిబాపూలే భార్య సావిత్రీబాయిపూలకు చదువు నేర్పించి ఆమె ద్వార వీధి బడిని నెలకొల్పి మహిళలకు రాత్రిపూట బడిలో చదువును నేర్పించి మహనీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ప్రజాసంఘాల నాయకులు, పట్టణ మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, వెన్న రాజు, వడ్డేపల్లి మల్లేశం, కండె సుదాకర్, కాదాసు థామస్, ఎండి హసన్, కౌన్సిలర్ వల్లపు రాజు, బోయిని ఎల్లయ్య, జాల ఆగయ్య, దాసరి శంకర్, బత్తుల రవి, జవహర్‌నాయక్, మైల కొంరయ్య, మార్క అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**గజ్వేల్‌లో...**

**గజ్వేల్, జనవరి 3 (ప్రభాతవార్త):**

భారతదేశపు తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ సంఘం షాపింగ్ కాంప్లెక్స్‌లో మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పొలిట్‌బ్యూరో మాజీ సభ్యుడు మైస రాములు, ఉమ్మడి మెదక్ జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు చిప్పల యాదగిరి, వేలూరు అంబేద్కర్ సంఘం నాయకుడు బ్యాగరి యాదగిరి, హృదయ రంజన్, రవి, వేణు, కిరణ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఫొటో/సిద్దిపేట-6 : కోహేడలో సావిత్రబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



బెజ్జంకిలో నివాళులర్పిస్తున్న విమలక్క తదితరులు

**మిరుదొడ్డిలో...**

**మిరుదొడ్డి, జనవరి 3, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని అందె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలను కేరింగ్ సిటిజెన్స్ కలెక్టివ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూకురి ప్రవీణ్, దళిత సంఘం నాయకులు అస్క స్వామి, ఉపాధ్యాయులు లక్ష్మణ్, విజయ్, రమణ, అజయ్ పాల్గొన్నారు.

**కొహేడలో...**

కొహేడ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం సావి త్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మంద మల్లేశం, వేల్పుల శంకర్, తిరుపతి, సుభాష్‌చంద్రబోస్, తేలు యాదగిరిగౌడ్, ముంజ ప్రకాష్‌రెడ్డి, లింగారెడ్డి, కూరెళ్ల వెంకటరెడ్డి, తూటి రాజిరెడ్డి, పద్మారెడ్డి, శ్రీనివాస్, జగదీష్, కిష్టయ్య, లింగాచారి, సత్తయ్య, లక్ష్మణ్, చంద్రయ్య, శ్రీనివాస్, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు టై, బెల్ట్, ఐడి కార్డుల పంపిణీ

**మర్కుక్, జనవరి 3 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు దాత రుక్మన్నగారి సుధాకర్‌రెడ్డి సహకారంతో టై, బెల్ట్, ఐడి కార్డులను మంగళవారం అందజేశారు. అంతకు ముందు పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భాగ్యబిక్షపతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు దాతలు ఎంతోమంది ముందుకు వచ్చారని వారి సహకారం మరువలేనిదన్నారు. సుధాకర్‌రెడ్డి విద్యార్థులకు అందించిన సహకారం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఎస్ఎంసి చైర్మన్ బాబు, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, విద్యా వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రామాయంపేటలో ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి

**రామాయంపేట, జనవరి 3, ప్రభాతవార్త :** పట్టణంలో సావిత్రిబాయిపూలే 192వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం నాడు సావిత్రి బాయి పూలే సంఘం మెదక్ జిల్లా అధ్యక్షురాలు పోచమ్మల అశ్విని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని పూలే విగ్రహాల వద్ద కార్యక్రమం నిర్వహించారు. సావిత్రిబాయిపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే అక్షరాన్ని ఆయుధంగా మార్చి భారతదేశ మహిళమణులకు అందించి అట్టడుగున ఉన్న వర్గాల ప్రజలను ఉన్నత శిఖరానికి చేర్చిన ఘనత సావిత్రిబాయిపూలేకు దక్కిందన్నారు. ఆనాటి కాలంలో ప్లేగు వ్యాధితో ప్రజలు అల్లాడుతున్న సందర్భంలో కుటుంబ సభ్యులే ప్లేగు వ్యాధి వచ్చిన వారిని వదిలేస్తున్న క్రమంలో అలాంటి వారందరిని ఒక దగ్గరకు చేర్చి వారికి సేవలు అందించిన మాతృమూర్తి సావిత్రిబాయి పూలే అన్నారు. అలాగే రాజకీయ అధికారంలో మహిళలకు వచ్చిన అవకాశాన్ని పూర్తిగా వాడకోవాలని సంతకాలకే పరిమితం కాకూడదని అన్నారు. అసెంబ్లీలో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎనిశెట్టి అశోక్, సురేష్ నాయక్, ఎమ్మార్పీఎస్ నాయకులు సాగర్, మల్యాల కిషన్, పాతూరి రాజు, మల్లేశం, శాంతికుమార్, బీసీ సంఘాల నాయకులు అల్లాడి వెంకటి, బాలమణి, వెల్మల రమేష్, వినయ్‌సాగర్, చాకలి వెంకటి, జలగడుగుల శ్రీనివాస్, పుట్టి శ్రీనివాస్, యాదగిరి, రామచంద్రం, పోచమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయిపూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

## పేదలకు అండగా రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్

**ములుగు, జనవరి 3 (ప్రభాతవార్త):** పేద కుటుంబాలకు అండగా రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ నిలుస్తుందని రోటరీ క్లబ్ గజ్వేల్ అధ్యక్షుడు ఏనుగు బాపురెడ్డి అన్నారు. మంగళవారం ములుగు మండలం చిన్నతిమ్మాపూర్ గ్రామంలో పంచాయతీ కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాపురెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి దేవేందర్‌రెడ్డి, నాయకులు మహేష్, శ్రీనివాస్, అసిస్టెంట్ గవర్నర్ కరుణాకర్‌రెడ్డి, కోశాధికారి నరసింహారెడ్డి, సభ్యులు సాయిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చిరంజీవి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రానికి ఒక్కటంటే ఒక్కటి డబుల్‌బెడ్ ఇవ్వరా ?

**అక్కన్నపేట, జనవరి 3, ప్రభాతవార్త** : మారుమూల గిరిజన దళిత అణగారిన ప్రజలు జీవనం సాగించే అక్కన్నపేట మండల కేంద్రంలో ఒక్కటంటే ఒక్కటి కూడా డబుల్‌బెడ్‌రూం గదులను అప్పగించకుండా అన్యాయం చేస్తున్న హుస్నాబాద్ శాసనసభ్యులు సతీష్‌కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని సిద్దిపేట జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులు నునావత్ మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు.ఈ విషయంపై మోహన్‌నాయక్ మాట్లాడుతూ అక్కన్నపేట మండలంలో దళిత బిడ్డలకు దళితబంధు పథకం సంక్షేమపథకం అందించి ఆదుకోవాలని అలాగే సర్వే నిర్వహించి నిరుపేదలైన ఇక్కడి ప్రజలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మహేష్‌నాయక్,చెరుకు సంపత్, కళ్యాణ్‌విష్ణు, యాదగిరి, వినయ్‌కుమార్, సుమన్‌నాయక్, రమేష్‌నాయక్ ఉన్నారు.

## అక్రమ అరెస్టులకు నిరసన

**చిన్నశంకరంపేట,జనవరి 3, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల నిధుల విషయంలో నిర్లక్ష్యధోరణికి టీపీసీసీ ఆధ్వర్యంలో భాగ్యనగరంలో ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అక్రమ గృహనిర్బంధానికి నిరసనగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీసులు కాంగ్రెస్ పార్టీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండల అధ్యక్షుడు పోతరాజు రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులకు నిధుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, నిధులు ఇవ్వకుండా వారిని అప్పుపాలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, మల్లేశం, మహమ్మద్, అక్బర్, పట్టణ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, సుధాకర్, రవిచంద్, స్వామి, యాదగిరి, సిదిరాంలు తదితరులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## పాఠశాల స్థాయి పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

**మిరుదొడ్డి, జనవరి 3, ప్రభాతవార్త :** తెలంగాణ సాంఘీక శా స్త్ర ఉపాధ్యాయ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల స్థాయిలో నిర్వహించే ప్రతిభపరీక్ష పత్రాన్ని అక బర్‌పేట-భూంపల్లి మండలంలోని జిల్లా పరిషత్ భూంపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు రాచకొండ భూపాల్ పాఠశాల ఉపాధ్యాయ బృందం అవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే పరీక్షలో భూంపల్లిలో ప్రథమ స్థానంలో బోయిని మౌనిక, ద్వితీయ స్థానంలో బక్కి సింధూర నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఈనెల 7న సిద్దిపేటలో జరిగే జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటారు. పాఠశాలస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్,సాంఘీకశాస్త్రం ఉపాధ్యాయులు భూపాల్ అభినందించారు.

## బాధిత కుటుంబానికి రూ.లక్ష అర్థిక సహాయం

**సిద్దిపేట రూరల్, జనవరి 3, ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మగనూర్ మండలం తాళంకేరి గ్రామానికి చెందిన నిరుపేద కౌలు రైతు ఈడిగి సాబెన్నగౌడ్ వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చ మార్గం లేక జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో సిద్దిపేటకు చెందిన ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్‌గౌడ్ బాధిత కుటుంబీకులకు రూ. లక్ష చెక్కును అర్థిక సహాయంగా అందించినట్లు సంస్థ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. అలాగే సాబెన్నగౌడ్ కూతురు వివాహనిమిత్తం పుస్తెమట్టెలు బహుకరించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని స్థానిక నాయకులు ఎవరూ అదుకోకపోవడంతో చలించిన చక్రధర్‌గౌడ్ లక్ష రూపాయల అర్థిక సహాయం అందించారని తెలిపారు.

## దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే దాగి ఉంటుంది

**కొమురవెల్లి, జనవరి 3, ప్రభాతవార్త :** టిఎల్ఎం ద్వారా బోధన జరిగితే తరగతి బోధన సులభంగా ఉంటుందని ఎంపిపి తలారి కీర్తన, జడ్పీటిసి సిలువేరు సిద్దప్ప, కొమురవెల్లి మల్లన్న అలయ పాలక మండలి చైర్మన్ గీస బిక్షపతిలు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన టిఎల్ఎం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో తట్టుకొని నిలబడే వ్యక్తులుగా తయారు కావాలంటే తరగతి కూడా చాలా కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందన్నారు. మంచి బావి భారత సమాజాన్ని తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఎంతైన ఉంటుందన్నారు. దేశ భవిష్యత్ మొత్తం తరగతి గదుల్లోనే ఉంటుందన్నారు.

## తొగుట పిహెచ్‌సి డాక్టర్‌గా రాధకిషన్

తొగుట, జనవరి 3, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని డాక్టర్ అర్.రాధకిషన్ అన్నారు. తొగుట పిహెచ్‌సి వైద్యులుగా మంగళవారం అయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండల పరిధిలోని అయా గ్రామాల్లోని నిరుపేదలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు ప్రభుత్వ దవాఖాలన సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## సిఎం రిలిఫ్ ఫండ్ పేదలకు వరం

**కొమురవెల్లి, జనవరి 3, ప్రభాతవార్త :** సిఎం రిలిఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని బిఆర్ఎస్ నాయకులు ఏర్పుల మహేష్ అన్నారు. మండల పరిధిలోని పోసాన్‌పల్లికి చెందిన మంగళి సత్తయ్యకు సిఎం సహాయ నిధి నుంచి రూ.60 వేల మంజూరు కాగా మంగళవారం చెక్కును లబ్దిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటీ వరకు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సిఎం రిలిఫ్ ఫండ్ అందించడం జరుగుతుందన్నారు. పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న బిఆర్ఎస్ సర్కారుకు ప్రతి ఒక్కరూ అండగా నిలువాలన్నారు. కార్యక్రమంలో బండి రమేష్‌గౌడ్, బాలరాజు, రవి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

**కొహేడ, జనవరి 3, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తంగళ్లపల్లిలో తొంటి రమేష్‌కు చెందిన రూ.70 వేల విలువ చేసే పాడి గేదె మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ పాము నాగేశ్వరి శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని రమేష్‌ను ఓదార్చారు. నష్టపోయిన రైతుకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. గ్రామానికి చెందిన పరివేద కొమురయ్య, పెద్ది కుమార్, శిగిరి రాజు, గడ్డం సతీష్, గడ్డం అంజనేయులు, గడ్డం వెంకటేష్, గడ్డం కుమార్, చిగిరి కొమురయ్య, ఎండ్రి నాగరాజు పాల్గొని బాధిత రైతుకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ లైన్‌మెన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదె

# మెట్ట రైతులకు సాగునీరు అందిస్తాం : ఎమ్మెల్యే

**అక్కన్నపేట, జనవరి 3, ప్రభాతవార్త**

మెట్ట రైతులకు రానున్న రోజుల్లో సాగునీరు అందిస్తామని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం అక్కన్నపేటలో బిఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధించుకుని కెసిఆర్ గద్దెనెక్కాక కరువుతో విలవిల్లాడుతున్న ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలనే తలంపుతోనే రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారన్నారు. ఈ నేపద్యంలో గౌరవెల్లి ప్రాజెక్టును నిర్మించి రైతులకు సాగునీరు అందించారని చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలో లక్ష అరువేల ఎకరాలకు సాగునీరందించేందుకు ప్రణాళికలు చేశారని చెప్పారు.దీంతో కరవు ప్రాంతమైన అక్కన్నపేట మండలం సాగునీటితో కళకళలాడుతందని సతీష్‌కుమార్ వెల్లడించారు.

ఈ దశలోనే గౌరవెల్లి ముంపు బాధితుల సమస్య తెరపైకి తెచ్చి విపక్ష పార్టీలు ప్రభుత్వంతో ఆడుకోవాలని చూశాయని తెలిపారు. విపక్ష పార్టీల ఆటలు సాగకుండా ప్రభు త్వం ముంపు బాధితులకు న్యాయం చేసి గౌరవెల్లి ప్రాంతాన్ని నీటితో నింపుతామని చెప్పారు. ఇంత కాలం కరువుతో ఇక్కట్లకు గురైన ఈ ప్రాంతంలో ఈ ఏడు అధిక దిగుబడిని సాధించిందని ఆయన పేరొన్నారు. అలాగే గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటుచేసి స్వయంపాలన చేసుకునే అవకాశాన్ని గిరిజనులకు కల్పించాడని చెప్పారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

**ప్రజాప్రతినిధుల్లో కొరవడిన సమన్వయం...**

అక్కన్నపేట మండలం ప్రజాప్రతినిధుల్లో సమన్వయం కొరవడినట్లుగా తన దృష్టికి వచ్చిందని ఇది మంచిపద్దతి కాదని అందరూ కలిసిపోతూ పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు కలిసిపోవాలని సతీష్ కుమార్ హితవు చెప్పారు. ఈ విషయంలో ప్రత్యేకంగా సమావేశమై సమస్యకు తీరుస్తానని నాయకులకు హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపొచ్చాలు తలెత్తకుండా ఉండేలా ఒక సీనియర్ నాయకుడిని నియమిస్తానని చెప్పారు.ఇదిలా ఉండగా సమావేశానికి వస్తున్న క్రమంలో ప్రజాప్రతినిధుల మధ్య తేడాలు ఉన్నట్లు బహరంగానే తాను చూసి తెలుసుకున్నానని వెలసిన పోస్టర్ల విషయంపై మాట్లాడారు.

**బిఆర్ఎస్‌లో సర్పంచ్, యువకుల చేరిక**

మండలంలోని కుందనవానిపల్లి గ్రామ సర ంచ్ దినేష్‌రెడ్డితో పాటు మరో 50 మంది యువకులు బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యురాలు భూక్య మంగ శ్రీనివాస్, ఎంపిపి మాలోతు లక్ష్మిబీలూనాయక్, నేషనల్ లేబర్ కోఆపరేటివ్ డైరెక్టర్ దండుగుల రాజ్యలక్ష్మి, మాజీ వ్యవసాయకమిటీ చైర్మన్ కాసర్ల అశోక్ బాబు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పెసరు సాంబరాజు, వైస్ఎంపిపి మజ్జిక మొగిళి,కందుల రాంరెడ్డి, పరుశరాములు మహిళా అధ్యక్షురాలు వెల్ది శోభారాణి, ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీ సంగ్రామ్ మహారాజ్

## 25 నుంచి అఖిల భారతీయ బంజారా సమాజ్ కుంభమేళా

**నారాయణఖేడ్, జనవరి 3 ప్రభాతవార్త:** అఖిల భారతీయ బంజారా సమాజ్ కుంభమేళా ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్రలోని జలగాం జిల్లా జన్మురు తాలూకా గోద్రి తండాలో జరుగుతుందని శ్రీసంత్ శ్రీసంగ్రామ్ మహారాజ్ అఖిల భారతీయ సాధు సంత్ ప్రతినిధి తెలిపారు. మంగళవారం నారాయణఖేడ్ మండలం ఖాంజీపూర్‌లో కుంభమేళాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసంగ్రామ్ మహరాజ్ రమేష్‌చౌహన్ బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ సమాజం కోసం ప్రతి గిరిజన తండాల్లో సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ బోధనను తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కుంబామేళాకు నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్‌నాయక్ ఉమ్మడి మెదక్ జిల్లా సంయోజక్, రాజ్‌కుమార్ జిల్లా సంయోజక్, రాజునాయక్, రవినాయక్, పండరీనాయక్, ముకుందనాయక్ పూజారీ డి.రవీందర్, మానిక్‌నాయక్, చందర్‌నాయక్, మోహన్‌నాయక్, రవీందర్‌నాయక్, డీఎస్టీతండా సర్పంచ్ రఘునాథ్, దిలీప్‌పటేల్, చందర్ నాయక్, రమేష్, అశోక్, శంకర్‌నాయక్, గోపాల్, రాజునాయక్ పాల్గొన్నారు.

## అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలి

**ఎంపిపి అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి**


మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

**సిర్గాపూర్, జనవరి 3 ప్రభాతవార్త:** అధికారులు, నాయకులు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఎంపీపీ అధ్యక్షులు జారా మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిర్గాపూర్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షులు జార మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణఖేడ్ నుంచి శ్రీశైలంకు బస్సు సర్వీసును నడిపించాలని కోరారు. వెంటనే ఆర్టీసీ మేనేజర్ స్పందించి త్వరలోనే బస్సును ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసీలు, అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై గ్రామసభలో చర్చ


మల్లిలో గ్రామ సభను నిర్వహిస్తున్న దృశ్యం

**న్యాల్‌కల్, జనవరి 3, ప్రభాతవార్త:** మండలంలోని మల్లి గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో గ్రామంలో నెలకొన్న సమస్యలపై, పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు, పంచాయతీ బాధ్యులతో చర్చించారు. గ్రామంలో మురుగు కాల్వలు, సిసి రోడ్ల నిర్మాణం, పారిశుధ్యం, వీధిదీపాలు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ జొట్గొండ మారుతియాదవ్, ఉప సర్పంచ్ బేగం బీ, ఎంపిటిసి సభ్యులు శివానంద శ్రీపతి, ఆత్మ కమిటీ డైరెక్టర్ బడక రాజు, పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్, వార్డు సభ్యులు సిద్దారెడ్డి, విఠల్, బాలన్న, పెంటమ్మ, అంజమ్మ, రంగమ్మ, శన్ను బేగం, సీఏ నర్సారెడ్డి, ఆశ వర్కర్లు శివలీల, జగదేవి, అంగన్‌వాడి టీచర్ సుకుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ అంబిక, రేషన్ డీలర్ భీమ్‌రావు, పంచాయితీ కార్మికులు డేవిడ్, చంద్రయ్య, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## ఆస్పత్రి నిర్మాణం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్ (కోహీర్), జనవరి 3, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని కోహీర్ మండల కేంద్రంలో 11 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న 50 పడకల ఆస్పత్రి నిర్మాణం పనులను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మంగళవారం పరిశీలించారు. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపనలు చేసిన విషయం పాఠకులకు విధితమే. శరవేగంగా కొనసాగుతున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించి సంబంధీకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు నర్సింలు, సర్పంచ్ జావీద్, మాజీ సర్పంచ్ కలీం, జహీరాబాద్ పట్టణ బిఆర్‌ఎస్ అధ్యక్షులు సయ్యద్ మోహియోద్దిన్, నాయకులు, ప్రజాప్రతినిధులు సందీప్‌కుమార్, సంపత్, సావూద్, అఖిల్, యూసుఫ్ పటేల్, సమృద్ధి, దివాకర్, ఫైసల్, అస్లాం, ఫిర్దోస్ వాజిద్, నగేష్, ఎం సందీప్ అన్సారీ, శ్రీను, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో టిఎల్ఎంను ప్రారంభించిన జడ్పిటిసి

**న్యాల్‌కల్, జనవరి 3, ప్రభాతవార్త:** విద్యార్థుల సృజనాత్మకత ఆలోచనలకు టిఎల్ఎం మేళాలు ఎంతో దోహదపడతాయని జడ్పీటిసి సభ్యురాలు బోడ స్వప్నభాస్కర్ అన్నారు. మంగళవారం న్యాల్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల స్థాయి టిఎల్ఎం (టీచర్ లెర్నింగ్ మెటీరియల్)ను జడ్పీటిసి ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు పాఠ్యాంశాన్ని అర్థవంతంగా, వేగవంతంగా అధిక రోజులు గుర్తించుకునేందుకు టిఎల్ఎం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యా అధికారి మారుతి, నోడల్ అధికారి కందర్ప, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రావు, మీనాకుమారి, సచ్చిదానందరెడ్డి, బిఆర్‌ఎస్‌నేతలు మఠం శివస్వామి, శ్రీశైలం, ప్రవీణ్, సిఆర్‌పిలు రాజు, రవి,విశ్వనాథ్, గోపాల్,మాణిక్, పాల్గొన్నారు.


న్యాల్‌కల్‌లో టిఎల్ఎం మేళాను ప్రారంభిస్తున్న జడ్పీటిసి స్వప్న భాస్కర్

# విద్యార్థుల సంరక్షణలో వసతిగృహ సంక్షేమ అధికారుల పాత్ర కీలకం

**టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు నరేందర్**


మాట్లాడుతున్న నరేందర్

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి3 ప్రభాతవార్త:** విద్యార్థుల సంరక్షణలో వసతిగృహ సంక్షేమ అధికారుల పాత్ర కీలకమని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు శేషాచారి అధ్యక్షతన నిర్వహించిన వసతి గృహ సంక్షేమ అధికారుల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులపట్ల సంక్షేమ అధికారులు ఉన్నత చదువులకు ప్రోత్సహిస్తూ వారిలో ఉన్న ప్రతిభను వివిధ పద్ధతుల ద్వారా వెలికి తీస్తూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించే విధంగా సంక్షేమ అధికారుల కృషి అమోఘమన్నారు. వసతి గృహ అధికారులకు టీఎన్జీవోల సంఘం అండగా ఉంటుందన్నారు.

సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహ మ్మద్ గౌస్ మాట్లాడుతూ సంక్షేమ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, అధికారులతో సమ న్వయంతో ముందుకుపోయి సంక్షేమ శాఖ అభి వృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ సమా వేశంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు గాండ్ల అనురాధ, ఎండి. ఇక్బాల్ పాషా, ఫజలుదీదన్, కార్యవర్గ సభ్యురాలు లీలీ, మెదక్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు శివాజీ, రామా గౌడ్, పశు సంవర్ధక శాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, సలావుద్దీన్, పంచాయితీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు నగేష్, జిల్లాలోని సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.


సావిత్రిబాయి పూలే జయంతిని జరుపుకుంటున్న దృశ్యం

## సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

**నాగల్‌గిద్ద, జనవరి 3, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిషన్ మాట్లాడుతూ భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయులురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ హన్మంత్‌రెడ్డి, జూనియర్‌అసిస్టెంట్‌న క్రిష్ణ, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

**పాపన్నపేట మండలంలో...**

**పాపన్నపేట, జనవరి 3, ప్రభాతవార్త:** సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలను మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలలలో సావిత్రి బాయిపూలే చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు యశోద మాట్లాడుతూ సావిత్రిబాయ పూలే మహిళల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిసింగ్, ఉపాధ్యాయులు వెంకటేశం, స్వామి, అశోక్, వీరేశం, రాజు, మదు, వేణుగోపాల్‌రెడ్డి, శశికుమార్‌రెడ్డి, నరేందర్, నాగరాజు, సుకన్య, నాగరాణి, జరీనా, జాకీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

**తారా కళాశాలలో...**



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రవీణ

**సంగారెడ్డి టౌన్, జనవరి 3, ప్రభాతవార్త:** మహిళల విద్యకు భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే చేసిన త్యాగాలు, సాహసాన్ని ఎనలేనివని సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ కళాశాల (ఎ) ప్రిన్సిపాల్ ప్రవీణ అన్నారు. మంగళవారం కళాశాలలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి నివాళులర్పించారు. జోగిపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, ప్రముఖ రచయిత్రి రజిత మాట్లాడుతూ ఆమె స్త్రీ విద్యావ్యాప్తికి నిరంతరం కృషి చేశాన్నారు. కార్య క్రమంలో కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ సుమతి, డాక్టర్ మంజుశ్రీ, వి సంతోషి, డాక్టర్ జ్యోత్స్న, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశం, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జగదీశ్వర్, షరీఫ్‌మియా, ఉమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

**టేక్మాల్‌లో...**

**టేక్మాల్, జనవరి 3, ప్రభాతవార్త:** టేక్మాల్ కస్తూర్బాగాంధీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ సర్పంచ్ సుప్రజ భాస్కర్, ప్రధానోపాధ్యాయురాలు జయలలిత, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరప్ప మాట్లాడుతూ భారతదేశంలో తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిపూలే ప్రముఖ సంఘ సంస్కర్త అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మీ, సుకన్య, లలిత, జన్సీ రాణీ, పారిజత మహేందర్‌లు పాల్గొన్నారు.

## సరస్వతిదేవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి


ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న యువజన సంఘాల నాయకులు

**కొల్చారం, జనవరి3 ప్రభాతవార్త:** సరస్వతిదేవిపై రేంజర్ల రాజేష్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల మూసివేసి బంద్ పాటించారు. కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో సరస్వతి అమ్మవారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మెదక్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. సరస్వతి అమ్మవారిపై అనుచిత వ్యాఖ్యలుచేసిన రాజేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రేంజర్ల రాజేష్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టీపీటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**మెదక్ అర్బన్, జనవరి3 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) మెదక్ జిల్లా క్యాలెండర్, డైరీని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు లావణ్యారెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రామ్‌రెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొండల్‌రెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాదగిరి, ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ శశిధర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు హీరాలాల్, రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ, పద్మ, సంగీత, జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు యాదగిరి, గోపాల్, రామచంద్రారెడ్డి, మొయిజొద్దీన్, జిల్లాకార్యదర్శులు భాగ్యలోక్మా, శివశంకర్, జిల్లా నాయకులు సురేందర్, వీరప్ప, యాదగిరి, జీవరత్నం, విజయ్ కుమార్, బాలకిష్టయ్య, బాలరాజు పాల్గొన్నారు.


టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి


కరుణాకర్‌రెడ్డికి సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

## పనిచేసేవారికి ఎక్కడైనా గుర్తింపు ఉంటుంది

**ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**

**నారాయణఖేడ్, జనవరి 3 ప్రభాతవార్త:** వ్యవసాయాభివృద్ధికి ఏడీఏ కరుణ కర్‌రెడ్డి చేసిన సేవలు ఎప్పుడు మరిచిపోలేమని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కరుణకర్‌రెడ్డి స్వచ్ఛంద పదవీవిరమణ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఏడీఏగా నాలుగు సంవత్సరాలుగా పదవీ బాధ్యతలు నిర్వహించి వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు తీసుకొచ్చి అనేక సమస్యలను పరిష్కరించిన ఏడీఏ కరుణకర్‌రెడ్డి అన్నారు. గతంలో వ్యవసాయ అధికారులు వ్యవసాయ సిబ్బంది రైతులతో సత్సంబంధాలు ఉండేవి కావని కరుణకర్‌రెడ్డి ఏడీఏగా వచ్చిన తర్వాత వ్యవసాయ నమోదు కార్యక్రమాలు కానీ వ్యవసాయ సంబంధిత ఉపయోగాలు తదతర అంశాల మీద కింది సిబ్బంది ఏఈవోలు ఏవోలు సక్రమంగా పనిచేశారని ఆయన బాదాతృదయంతో తెలియజేశారు. కాగా మంగల్‌పేట్ నుంచి బ్యాండ్ మేళాలతో వ్యవసాయాధికారులు పట్టణంలో భజ భజంత్రీలతో టపకాయలు కాలుస్తూ ఊరేగింపు తీశారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ బిఆర్ఎస్ నాయకులు, ఆత్మ కమిటీ చైర్మన్లు, ఏవోలు, ఏఈవోలు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

**కొల్చారం, జనవరి3 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని పైతర సర్పంచి వెల్మకన్న సంతోష ఎల్లేశం అన్నారు. మంగళవారం కొల్చారం మండలం పైతర ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల పరిధిలోని పైతర గ్రామానికి చెందిన పోతుల రవి, సంధ్యారాణి దంపతుల కూతురు భానుశ్రీ మొదటి పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలోని 160 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచి వెల్మకన్న సంతోష ఎల్లేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. పోతుల రవి, సంధ్య దంపతులు మాట్లాడుతూ తాను చదివిన పాఠశాలలో తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**పాపన్నపేట, జనవరి 3, ప్రభాతవార్త:** అయుష్మాన్ భారత్ పథకాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య మిత్రలు సురేష్, బ్రహ్మానందలు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అయుష్మాన్ భారత్ పథకానిన అమలు చేస్తూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని లబ్దిదారులు తమ తమ కేవైసి, ఆదార్‌కార్డులను అందించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయుష్‌మాన్ భారత్‌పై పూర్తి వివరాలకు 996356351 లేదా, 7995286578లను సంప్రదించాలని సూచించారు.

## టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభ..జిల్లా స్థాయికి ఎంపిక

**కొల్చారం, జనవరి 3 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కొంగోడ్ పాఠశాలకు చెందిన జి. రవితేజ, పోతంశెట్టిపల్లి పాఠశాలకు చెందిన సీహెచ్. అశ్విని, ఎం. మనోహార్, ఇంగ్లీష్ మీడియంలో కొల్చారం పాఠశాలకు చెందిన జే. ఫనిందర్, పి. భవాని, పి. ప్రణీత్ గౌడ్‌లు ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ విద్యార్థులు జిల్లా స్థాయిలో టాలెంట్ టెస్ట్ రాయున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రబీక్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వి. సంగయ్య, కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ కెరటం సావిత్రి బాయి పూలే

**రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్**


సావిత్రి బాయి పూలే, మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న చింతా ప్రభాకర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 3, ప్రభాతవార్త:** సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద ఉన్న సావిత్రి బాయి పూలే విగ్రహానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతదేశానికే ఆదర్శం... అక్షర సరస్వతి సావిత్రి బాయి పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్‌రెడ్డి, మాజీ జెడ్పిటీసీ మనోహర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి నర్సింలు, కౌన్సిలర్లు జీవి శ్రీనివాస్, విష్ణు, మండల అధ్యక్షులు చక్రపాణి, మల్లేశం, జలేందర్, సర్పంచ్ మోహన్ సింగ్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో బిజెపి అసెంబ్లీ నియోజకవర్గం సమావేశం

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 3, ప్రభాతవార్త:** సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం శక్తి కేంద్రాలు, నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించడం జరిగింది. కొంపల్ల మోహన్‌రెడ్డి నియోజకవర్గ పాలక్ ఇట్టి సమావేశంలో పాల్గొని, బూత్ స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఏం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేశ్వరావు దేశ్‌పాండే, జిల్లా జనరల్ సెక్రెటరీ పి హనుమంత్‌రెడ్డి, కో-కన్వీనర్ సత్యనారాయణ, సంగారెడ్డి బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు, రాష్ట్ర నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు పాల్గొనడం జరిగింది.


మాట్లాడుతున్న బిజెపి నాయకులు


మంత్రి హరీష్‌రావును కలిసిన మెకానిక్ అసోసియేషన్ సభ్యులు

## మంత్రిని కలిసిని మెకానిక్ అసోసియేషన్ బాధ్యులు

**జహీరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణం మెకానిక్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని బూర్దిపాడ్ గ్రామంలోని 83 సర్వే నంబరులో 4 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆటోనగర్ కోసం ప్రభుత్వం కేటాయించింది. భూమిని కేటాయించిన మంత్రి హరీష్‌రావుకు పూల బొకేను అందించి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ తన్వీర్, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్, నాయకులు యూకూబ్, గోవర్ధన్‌రెడ్డి, ఆటో మెకానిక్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## న్యాయ సహాయంపై ఆశావర్కర్లకు అవగాహన

**సంగారెడ్డి టౌన్, జనవరి 3, ప్రభాతవార్త:** జిల్లా న్యాయసేవాధికర సంస్థ కార్యదర్శి జె హన్మంత్‌రావు మంగళవారం పట్టణంలోని దుర్గాబాయి మహిళా వికాస కేంద్రంలో జిల్లాలోని ఆయా మండలాలలకు చెందిన ఆశా వర్కర్లలకు న్యాయ అవగాహనపై అవగాహన కల్పించారు. ఆశా వర్కర్లకు గ్రామాల్లోని అన్ని సమస్యలు అవగతమై ఉంటాయని, భూములకు సంబంధించిన సమస్యలు, భూతగాదాలు, వివిధ రకాల మహిళ సమస్యలు ఆశా వర్కర్ల దృష్టికి వస్తూ ఉంటాయన్నారు. ఆశావర్కర్లకు చట్టాలపై అవగాహన ఉంటే బాధితులకు సహాయ సహకాఆరలు అందించే అవకాశాలు ఉంటాయన్నారు. జిల్లాలోని ఏ గ్రామంలో అయినా సమస్యలు ఉత్పనం అయితే జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, ఉచితంగానే న్యాయ సలహాలు అందచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దుర్గాబాయి మహిళా వికాస కేంద్రం మేనేజర్ సుగుణ, ఆశావర్కర్‌ల ప్రతినిధి సుందరి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## ఎంపి బిబిపాటిల్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు


పూల బుకేతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

**సదాశివపేట, జనవరి 3, ప్రభాతవార్త:** జహీరాబాద్ ఎంపి బిబిపాటిల్ హైద్రాబాద్‌లోని నివాసంలో సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా కార్యనిర్వాహణ అధ్యక్షులు సూర్యోదయ దెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఇప్పెపల్లి నర్సిములు అధ్వర్యంలో మంగళవారం పూల బుకేను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు కార్యవర్గం తరపున తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు ప్రసాద్ మధు శేఖర్‌లతో పాటు యువత అధ్యక్షులు మల్లికార్జున్, యువ నాయకులు శివరాజ్, ప్రశాంత్, జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి శారద, మహిళా నాయకురాలు అరుణ, సమాజం జిల్లా నాయకులు అడివయ్యస్వామి, సుభాష్, శ్రీనివాస్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం


కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి 3 ప్రభాతవార్త:** మెదక్‌లో కాంగ్రెస్ నేతలు ఆందోళనలు చేపట్టారు. సర్పంచుల నిధులు రాష్ట్ర ప్రభుత్వం కాజేస్తుందని ఆరోపిస్తూ ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నేతలు కేసీఆర్ దిష్టిబొమ్మకు నిప్పు పెట్టి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు షేక్ సల్మాన్, నవీన్ చౌదరి, నరేష్, భిక్షపతి, ఆమీర్ తదితరులు పాల్గొన్నారు.

## 10 విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షలు

**పాపన్నపేట, జనవరి 3, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పాపన్నపేటలోని ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి సాంఘీక శాస్త్ర ప్రతిభా పాటవ పరీక్షలు తెలంగాణ సాంఘీక శాస్త్ర టీచర్స్ ఫోరం మెదకన జిల్లా అదేశాల మేరకు నిర్వహించారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా ఎన్ సత్యనారాయణ, కో-కన్వీనర్‌గా యశోదలు వ్యవహరించగా ముఖ్య అతిథిగా పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిసింగ్ హాజరై పరీక్షలను పరిశీలించారు. పాఠశాలలో నిర్వహించిన పరీక్షల్లో మండలంలోని ఆయా గ్రామాల్లోని 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా ఇంగ్లీష్ మీడియం నుంచి ప్రథమ స్థానంలో శ్రీలేఖ, ద్వితీయ స్థానంలో వనజ, తృతీతయ స్థానంలో వైష్ణవిలు నిలిచారని నిర్వాహకులు ప్రకటించారు. తెలుగు మీడియం నుంచి ప్రథమ స్థానంలో శీరాష, ద్వితీయ స్థానంలో భవాని, తృతీయ స్థానంలో శ్రావణిలు ఉన్నారన్నారు. జిల్లా స్థాయిలో పరీక్షలు జనవరి 7వ తారీఖున నిర్వహించనున్నారని, మండల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మండలానికి చెందిన సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు దేవయ్య, ప్రసాద్‌రెడ్డి, అశోక్, జ్యోతి, భూలిబాయి, రంగారెడ్డి, కాశీనాథం, రజాక్, నరేందర్, జిల్లా కార్యదర్శి టి నర్సింలు పాల్గొన్నారు.

## కడుపుకొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

**కంది, జనవరి 3, ప్రభాతవార్త:** కడుపునొప్పి భరించిలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కాశీపురం గ్రామంలో జరిగింది. ఎస్ఐ ఇంద్రకరణ్ కథనం ప్రకారం...గ్రామానికి చెందిన భోథన్‌గౌడ్(39) ఆటోను తోలుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతూ వస్తున్నాడు. కడుపునొప్పితో బాధ పడుతూ ఆటోను తోలలేక ఇబ్బందులు పడుతూ ఆస్పత్రులలో చికిత్సలు చేయించుకున్నా ప్రయోజనం లేకపోవడంతో గతంలో ఒకసారి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబ సభ్యులు గమనించి కాపాడారు. ఈ నెల 2వ తేదీ సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి భార్య షాపురం జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇంద్రకరణ్ వివరించారు.

## అచ్చన్నపల్లిలో మరో యువకుడు

**టేక్మాల్, జనవరి 3, ప్రభాతవార్త:** జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా టేక్మాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అచ్చన్నపల్లి గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళ్లితే...అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన గుండ్ల శ్రీకాంత్ యువకుడు జీవితంపై విరక్తి చెందిన ఇంట్లోనే ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని తల్లి రుక్కమ్మ తెలిపింది. తెల్లవారుజామున వాకిలి ఉడుస్తుండగా పక్కగదిలో ఉన్న శ్రీకాంత్ గదిలోకి తల్లి చూడక దూలానికి ఉరి వెసుకోని వెళాటటం చూసి ఎక్క సారిగా అరువడంతో ఇరుగు పోరుగు చేరుకొన్నారని తల్లి రుక్కమ్మ తెలిపింది. మృతునికి భార్య పిల్లలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నాట్లు టేక్మాల్ ఎస్ఐ లింగం తెలిపారు.